www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
ప్రజల గొంతుక...
దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 186 బుధవారం, ఏప్రిల్ 01, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




## ఏప్రిల్ 2 నుంచి పెద్ద ఎత్తున
# గ్రామసభలు

- సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరణ
- అభివృద్ధిపై ప్రజలకు అవగాహన
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్,మార్చి 31 :** ప్రజా పాలన -ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రజా పాలన -ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూ చించారు. రైతు భరోసా లబ్దిదారుల పేర్లు, 200 యూనిట్ల విచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల మిగతా2లో...

## ఆటో సర్వీసులకు
# గ్యాస్ కొరత

- తక్షణమే సమస్య పరిష్కరించండి: కేంద్రమంత్రి హరిదీప్ సింగ్ పూరికి ఉత్తమ్ లేఖ



**హైదరాబాద్,మార్చి 31 :** హైదరాబాద్‌లో ఎల్‌పీజీ ఆటోరిక్షాలు ఎదుర్కొంటున్న గ్యాస్ కొరతపై కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అదనపు ఎల్‌పీజీ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాల కోసం డొమెస్టిక్ ఎల్‌పీజీ సరఫరా 100 శాతం కొనసాగించాలని కోరారు. కమర్షియల్ ఎల్‌పీజీ పంపిణీపై కేంద్ర మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఆటో ఎల్‌పీజీ రంగం తీవ్రంగా ప్రభావి తమైందన్నారు. తెలంగాణలో సుమారు 1 లక్ష ఎల్‌పీజీ ఆటోరి క్షాలు రోడ్లపై నడుస్తున్నాయి. ప్రభుత్వ సంస్థల వాటా కేవ లం 20 శాతం మాత్రమే ఉంది. ప్రైవేట్ కంపెనీలు 80 శాతం మార్కెట్‌ను ఆక్రమించాయి. రాష్ట్రవ్యాప్తంగా 110 ప్రైవేట్ ఎల్‌పీజీ ఔట్‌లెట్లు ఉన్నాయి. రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. అనేక ప్రైవేట్ ఔట్‌లెట్లు మిగతా2లో...



## ఒంటిమిట్టలో వైభవంగా
# బ్రహ్మోత్సవాలు

- నేటి కళ్యాణోత్సవానికి సిఎం చంద్రబాబు దంపతుల రాక

**ఒంటిమిట్ట,మార్చి 31 :** ఒంటిమిట్టలోని ప్రసిద్ధ కోదండరామ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మో త్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.ఇందులో భాగంగా ఏప్రిల్ 1 బుధవారం రాత్రి ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మహోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మిగతా2లో...



- కేరళ ప్రచారం కోసం 30నే అసెంబ్లీ వాయిదా
- కాళేశ్వరంపై కేంద్రమంత్రి వ్యాఖ్యలు సరికావు
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేత హరీష్

## అసెంబ్లీలో సమస్యలు చర్చకు
# రాకుండా చేశారు

**హైదరాబాద్,మార్చి 31 :** ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృధా చేశారని మాజీ మంత్రి, డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్ హరీష్ రావు అన్నారు. అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడిపారని.. అసెంబ్లీలో టీ బ్రేక్ అని చెప్పి, ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి వస్తున్నాడని ఒకరోజు, కేరళ నుండి వస్తున్నాడని ఒకరోజు.. నాలుగు గంటలు వృధా చేశారన్నారని ఆరోపించారు. మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. ఒకరోజు పెండ్లి ఉందని పోతరు, ఒకరోజు ÷నాన్స్ మినిస్టర్ ప్రిపేర్ అవుతున్నాడని అని సభ ఆపేస్తారు. అసలు సభకు వచ్చి ప్రిపేర్ అవుతారా, ప్రిపేర్ అయ్యాక సభకు వస్తారా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఒకరోజు విద్యుత్ ఉద్యోగులకు చెక్కులు ఇవ్వాలని 4 గంటలు వృధా చేశారని.. మండిపడ్డారు. కేరళ ఎన్నికల కోసం శాసనసభని 30వ తేదీనే బంద్ పెట్టారు. కేరళ ఎన్నికలు మీకు మిగతా2లో...



## చల్లపల్లి
# పోలీస్‌స్టేషన్‌లో పేలుడు

- నలుగురు పోలీసులకు గాయాలు

**విజయవాడ,మార్చి 31 :** కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు తీవ్రగాయాలయ్యాయి. మందుగుండు సామగ్రిని పోలీసులు బయట నుంచి తీసుకొచ్చి పీఎస్‌లో పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటుచేసున్నట్లు సమాచారం. గాయపడిన వారిలో ఎస్సైతో పాటు పోలీసు వాహన డ్రైవర్ దుర్గాంజనేయులు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స మిగతా2లో...

## అసోంలో మహిళలకు మూడువేల తాయిలం

- 31 హామీలతో బిజెపి మేనిఫెస్టో విడుదల



**గౌహతి,మార్చి 31 :** త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో మంగళవారం బిజెపి సంకల్ప పాత్ర పేరుతో 31 హామీలతో మేనిఫెస్టోను విడుదల చేసింది. ఈ హామీల్లో కీలకంగా ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి), మహిళలకు అరుణోదరు పథకం కింద నెలకు మూడువేల రూపాయల్ని నేరుగా తమ బ్యాంకు అకౌంట్లలో జమ చేయడం వంటివి ఉన్నాయి. మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మాట్లాడుతూ.. 'అస్సాంని ప్రకాశవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే బిజెపి లక్ష్యంగా పెట్టుకుంది' అని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాల మాదిరిగానే అస్సాంలో కూడా యుసిసిని అమలు చేయడమే బిజెపి అజెండా మిగతా2లో...

## నలంద ఆలయంలో వద్ద తొక్కిసలాట

- 8మంది మహిళా భక్తులు మృత్యువాత







## ట్యాంక్ బండ్ శివకు 5లక్షల ఆర్థిక సాయం

- అందచేసిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మార్చి 31 :** ట్యాంక్ బండ్ శివకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయం అందించారు. కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థికసాయంతో పాటు అతని కుమారుడు వేణుమాధవ్ కు హోం గార్డు ఉద్యోగ నియామకపత్రం అందజేసారు. ట్యాంక్ బండ్ పై ఎంతో మంది ప్రాణాలను కాపాడిన శివ గురించి ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి చేరింది. ట్యాంక్ బండ్ శివ దీన పరిస్థితిని అర్థం చేసుకున్న సిఎం అతడిని ఆదుకోవడానికి నిర్ణయించారు.ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న ట్యాంక్ బండ్ శివకు ఆర్థిక సాయం మిగతా2లో...

## మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిని హనుమాన్ జయంతి వేడుకలకు ఘనంగా ఆహ్వానం



**బాలానగర్ ఏప్రిల్ 01 ( పీపుల్స్ న్యూస్):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలానగర్ డివిజన్‌లో హనుమాన్ జయంతి శుభ సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు వినోద్ నాయుడు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిసి, హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. వినోద్ నాయుడు మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులందరికీ ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆవుల రవీందర్ రెడ్డి ఈ ఆహ్వానాన్ని స్వీకరించి, కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా బాలానగర్ ప్రాంతంలో భక్తి భావం మరింత పెంపొందు తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## కలెక్టర్ సారు మా లక్ష్మీదేవి పేటను మరిచారా

**కంకర పరిచారు..రోడ్డు మరిచారు**
**రాకపోకలకు ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు**
**లక్ష్మీదేవిపేటలో చెలరెగుతున్న దుమ్ము.**
**రోగాల బారిన పడుతున్న ప్రజలు.**
**పట్టించుకొని అధికారులు.**



**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 31(పీపుల్స్ న్యూస్):**ములుగు జిల్లా వెంకటాపుర్ మండలం లక్ష్మీదేవిపేట నుండి పాలంపేట మార్గం మధ్య కంకర పోసి డాంబర్ వేయడం మరిచారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తూన్నరని ప్రజలు ఆరోపిస్తూన్నారు.యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి, ప్రదాన రహదారి అయిన ఈ రోడ్డు పై నిత్యం వివిధ రకాల వాహనాలు వెళ్తూ ఉంటాయి. ఈ వాహనాల కారణంగా చెలరేగుతున్న దుమ్ముతో,గ్రామస్థులు శ్వాసకోశ భారిన పడుతున్న స్పందించని అధికారులు.పాలంపేట, లక్ష్మీదేవిపేట ఈ రెండు గ్రామల మద్య సౌకర్యం కోసం రోడ్డు నిర్మాణం జరుగుతుందంటే,ప్రజలు చాల సంతోషించారు.కాని ఇలా రోడ్డు అర్థాంతరంగా అగిపోతుందని అనుకోలేదని ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని,ప్రజలు కోరుతున్నారు.రాత్రివేళ చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.వెంటనే స్పందించి రోడ్డు మార్గం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు

## మన చారిత్రక సంపదను కాపాడుకుందాం

**అభివృద్ధి బాటలో చారిత్రక క్షేత్రం -- ప్రజాప్రతినిధుల ప్రత్యేక చొరవతో మారనున్న రూపురేఖలు.**
**చారిత్రక సంపద దెబ్బతినకుండా మౌలిక వసతుల కల్పనజరగాలి భిక్షు సద్దారక్కిత బంతే**



**ఖమ్మం /మార్చి 31/(పీపుల్స్ న్యూస్ )**ఖమ్మం జిల్లాలోని చారిత్రక నేలకొండపల్లి బౌద్ధ స్థూపానికి పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. గత కొన్ని నెలలుగా పురావస్తు శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిథిలాల తొలగింపు పనులు విజయవంతంగా పూర్తికాగా, త్వరలోనే రెండో దశలో భాగంగా కన్సర్వేషన్ (సంరక్షణ) పనులను ప్రారంభించనున్నట్లు పురావస్తు అధికారి నర్సింగ్ వెల్లడించారు. ఈ క్షేత్ర అభివృద్ధిపై స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి అధికారులకు దిశానిర్దేశం చేస్తుండగా, గతంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించి రూపొందించిన ప్రత్యేక ప్రణాళికలు ఇప్పుడు కార్యాచరణలోకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా సోమవారం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి నేలకొండపల్లి బౌద్ధ స్థూపాన్ని ప్రపంచ పర్యాటక పటంలో నిలపాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రస్తావించటం ఈ ప్రాంత అభివృద్ధికి మరో కీలక అడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు.మరోవైపు, బౌద్ధ భిక్షువు భిక్షు సద్దారక్కిత బంతే ఈ క్షేత్రాన్ని సందర్శించి, చారిత్రక సంపద దెబ్బతినకుండా పనులు నిర్వహించాలని, పర్యాటకుల కోసం మౌలిక వసతులు కల్పించాలని గతంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, ముజ్జిగూడెం సర్పంచ్ బొడ్డు వసంత, ఉప సర్పంచ్ మద్దినేని మహేష్, మాజీ ఎంపీటీసీ బొడ్డు బొందయ్య, ఎమ్మార్పీయస్ ఈదన్న,గ్రీన్వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ అధ్యక్షులు దుద్దెల రవి, వార్డు మెంబర్లు మరియు పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొని, ఈ బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తమ మద్దతు ప్రకటించారు.

ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో నేలకొండపల్లి త్వరలోనే ప్రపంచ స్థాయి గుర్తింపు పొందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజల వద్దకే పాలన -- బాలానగర్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ముందడుగు

**బాలానగర్ ఏప్రిల్ 01 ( పీపుల్స్ న్యూస్):**కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న "ప్రజల వద్దకే ప్రజా పాలన" కార్యక్రమం ప్రజలకు మరింత చేరువవుతూ, వారి సమస్యలను నేరుగా పరిష్కరించే దిశగా ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే పరిష్కరించాలనే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నారు. కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ సూచనల మేరకు, బాలానగర్ మండలంలోని వివిధ డివిజన్లలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఆదేశాలు జారీ చేయబడ్డాయి. ఈ క్రమంలో నేడు పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా బాలా నగర్ మండలం రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక కార్య



క్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధి కారులు హాజరై, ప్రజల సమస్యలను స్వయంగా విని వివరణ కోరారు.ఈ సందర్భంగా కూకట్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందేలా చూడాలని కోరారు. అలాగే కులం, ఆదాయం, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ సమస్యలు, విద్యుత్ సరఫరా వంటి కీలక అంశాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిర్లక్ష్యం లేకుండా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ మండలానికి చెందిన పలువురు ప్రజలు పాల్గొని తమ సమస్యలను అధికారుల ముందు ఉంచారు.ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలకు స్థానిక ప్రజల నుండి మంచి స్పందన లభిస్తోంది.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

**మహాలక్ష్మి పథకం మహిళలకు ఆర్థిక భరోసా**
**ఉచిత బస్సు ప్రయాణం వెలకట్టలేనిది**
**మహిళా సంఘాలే అసలైన శక్తికి నిదర్శనం**
**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 31( పీపుల్స్ న్యూస్)**ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం మహిళల జీవితాల్లో వెలుగు నింపుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం – ఉత్సవాలు 2026" కార్యక్రమాన్ని నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా 29.03.2026 నాటికి 290 కోట్ల ప్రయాణాల ద్వారా సుమారు 10 వేల కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా అయ్యాయని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ములుగు జిల్లాలో ఇప్పటి వరకు 1.90 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలు 133.25 కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని స్పష్టం చేశారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం పథకాలను రూపొందిస్తుందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.ఈ పథకం ద్వారా కూలీ పనులు చేసుకునే వారు, మధ్యతరగతి మహిళలు మరియు ఉద్యోగినులు ఎంతో




లబ్ధి పొందుతున్నారని కలెక్టర్ అన్నారు."గతంలో దూర ప్రాంతాల్లో ఉన్న బిడ్డలను చూడాలంటే ప్రయాణ ఖర్చుల గురించి ఆలోచించేవాళ్లమని, ఇప్పుడు రూపాయి ఖర్చు లేకుండా సాఫీగా ప్రయాణం చేస్తున్నామని" ఒక లబ్ధి పొందిన మహిళ తనతో సంతోషాన్ని పంచుకుందని గుర్తు చేశారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ త్వరలోనే సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు.గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం గర్వకారణమని, దీనివల్ల వేల కోట్ల రూపాయల ఆదా చేసుకోగ లిగారని హర్షం వ్యక్తం చేశారు.మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మహిళల సంక్షేమమే ధ్యేయంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరుల






ను చేయాలనే లక్ష్యంతో "ఇందిరా మహిళా శక్తి" పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, ఆర్టీసీ డి.ఎం. రవిచందర్, అడిషనల్ డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రతిబింబించేలా గ్రామసభ నిర్వహణ

**డిప్యూటీ సింఎం భట్టి విక్రమార్క మల్లు.**
**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని కలెక్టర్లు సమీక్షిస్తూ విజయవంతంగా అమలు చేయాలి.**
**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలు, గ్రామసభ నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించిన డిప్యూటీ సింఎం.**



**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 31 (పీపుల్స్ న్యూస్)** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రతిబింబించేలా గ్రామసభ నిర్వహించాలని డిప్యూటీ సింఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు మంగళవారం హైదరాబాద్ నుంచి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలు, ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామ, వార్డుసభల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణా రావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశానికి ములుగు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలలో ప్రజలకు అందించే సమాచారం ఒకే రీతిన ఉండాలని, గ్రామ సభలకు వార్డు మెంబర్ నుంచి ఎంపీ, మంత్రుల వరకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు.గ్రామసభలో ముఖ్యమంత్రి సందేశం, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డు, సన్న బియ్యం సరఫరా, గిరిజన రైతులకు ఉచిత పంపు సెట్లు వంటి వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న లబ్ధిదారుల చేత గ్రామ సభలలో మాట్లాడించాలని అన్నారు జూన్ 2 నుంచి ప్రారంభించే ఇందిరమ్మ జీవిత బీమా పథకం, ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు అల్పాహార కార్యక్రమంతో పాటు, పాలు, రాగి జావా అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ విస్తృతంగా ప్రచారం జరిగేలా చూడాలని అన్నారు. సాంస్కృతిక శాఖ కళాకారులను ఉపయోగిస్తూ ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్నారు.గ్రామాలకు ప్రభుత్వం భారీ ఎత్తున విడుదల చేసిన నిధులను గ్రామ అభివృద్ధికి వినియోగించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు కలెక్టర్లు సమీక్షిస్తూ విజయవంతంగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు.సీఎస్ కె.రామకృష్ణా రావు మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చ్ 6 నుంచి 15 వరకు నిర్వహించిన పెండింగ్ ఫైల్స్ సత్వర పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని, అదే స్ఫూర్తితో ఏప్రిల్ 2న గ్రామ, వార్డు సభలు విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు.ప్రతి జిల్లాలో గ్రామ సభలు ఎలా జరుగుతున్నాయి అనే అంశంపై రిపోర్టు అందించాలని కలెక్టర్ లను ఆదేశించారు. గ్రామ సభలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని, స్థానిక ప్రజా



ప్రతినిధులు తప్పనిసరిగా గ్రామసభలో ఉండాలని అన్నారు.గ్రామ సభలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియ జేయాలని అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాలని అన్నారు.గ్రామసభ తరహాలో మున్సిపాలిటీ వార్డులో సైతం సభలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ప్రస్తుత బడ్జెట్ లో ప్రతిపాదించిన వివిధ పథకాలకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా గ్రామ, వార్డు సభలలో ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలందరికీ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం తెలిసే విధంగా వార్డు సభలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 తేదీన గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని తెలిపారు. గ్రామ, వార్డు సభలు నిర్భహణపై ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్ మరియు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం, జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సభలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నియమితులైన ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను తప్పనిసరిగా నిర్వహించి, నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలోని ప్రజలందరూ గ్రామ సభలకు హాజరై తమ అభిప్రాయాలు, సమస్యలను వెల్లడించి, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డి పి ఓ వెంకయ్య, డి ఎం అండ్ హెచ్ ఓ గోపాల్ రావు, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, డి ఏ ఓ సురేష్ కుమార్, సిపిఓ ప్రకాశ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ కో లెక్క..
# పేదోడికో లెక్కా నా..?

- గూడు లేక గుడి చేసుకుంటే వాలిపోయే యంత్రాంగం.
- 2.32 ఎకరాలు తత్వ గ్లోబల్ ఆధీనంలో లేదా..?

**కుత్బుల్లాపూర్ : మార్చి 31 (పీపుల్స్ న్యూస్)**










కుత్బుల్లాపూర్ రెవెన్యూ మండల పరిధిలోని గాజులరామారం సర్వే నంబర్ 127 లో సుమారు 2.32 ఎకరాల ప్రభుత్వ భూమి తత్వ గ్లోబల్ స్కూల్ కబ్జా చేసినప్పటికీ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ భూమిపై పలుమార్లు స్థానికులు, ప్రజాసంఘాలు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీడ లేక "పేదోడు 50--60 గజాల్లో గుడిసె వేసుకుంటే వెంటనే వచ్చి వాలిపోయే రెవెన్యూ , జిహెచ్ఎంసి అధికారులకు తత్వ గ్లోబల్ స్కూల్ చేసిన కబ్జా ఎందుకు కనబడటం లేదని ప్రశ్నిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలకు ఒక చట్టం, పేదోడికి ఒక చట్టం ఉంటుందా అని ప్రజలు మండిపడుతున్నారు. తత్వ గ్లోబల్ స్కూల్ సుమారు 2.32 ఎకరాల భూమిని ఆక్రమిస్తే ఎందుకు చూస్తూ ఊరుకుంటున్నారు?" అని ప్రశ్నిస్తున్నారు. ఇది ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వారు ఆరోపిస్తున్నారు. ఇక గతంలో కొన్ని రెవెన్యూ తనిఖీల్లో ఈ భూమి ప్రభుత్వానికి చెందిందని గుర్తించినట్టు సమాచారం ఉన్నప్పటికీ, ఆ భూమిని తిరిగి ప్రభుత్వ అధీనంలోకి తీసుకునే చర్యలు ఎందుకు ఆలస్యం అవుతున్నాయన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూముల రక్షణలో అధికారులు సమానంగా వ్యవహరించాలని, ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా అవసరాలకు కేటాయించాలి. బాలాజీ లేఔట్ సర్వేనెంబర్ 127 లో ఉండే సుమారు 2.32 గుంటల ప్రభుత్వ స్థలాన్ని గ్లోబల్ స్కూల్ నుండి ప్రభుత్వం ఆధీనంలో తీసుకొని ఆ ప్రాంతంలో ప్రజలకు ఉపయోగపడే హెల్త్ సెంటర్ ,పార్కులు, ఓపెన్ జిమ్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూమి ఎక్కువగా ఉన్నందున ప్రజాప్రయోజనాలకు ఉపయోగించడం వలన వారికి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. బాధ్యత కలిగిన విద్య బోధన వృత్తిలో ఉంటూ ప్రభుత్వ భూమిని కబ్జా చేయడంపై వారికున్న క్రెడిబిలిటీని బయట పెట్టుకున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి భావి భారత నిర్మాణానికి సహకరించాల్సిన గ్లోబల్ స్కూల్ ప్రభుత్వ భూములను కబ్జా చేసి సమాజానికి ఇలాంటి సందేశం అందజేస్తుందా అంటూ ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వ స్థలాలు, కుంటలను బాధ్యత కలిగిన హైడ్రా ఇక్కడ దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పేదోడు నివసించడానికి గుడిసె వేసుకుంటే వాలిపోయే హైడ్రా అధికారులు వందల కోట్ల విలువైన భూ అక్రమన జరిగితే మౌనం వహించడం మంచిది కాదని హైడ్రా ను స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## కేరళ ఎన్నికలు మీకు అవసరమేమో



**హైదరాబాద్ :**అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడుపుతున్నారని.. అసెంబ్లీలో టీ బ్రేక్ అని చెప్పి, ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి వస్తున్నాడని ఒకరోజు, కేరళ నుండి వస్తున్నాడని ఒకరోజు.. నాలుగు గంటలు వృథా చేశారన్నారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆరోపించారు.మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. ఒకరోజు పెండ్లి ఉందని పోతరు, ఒకరోజు ఫైనాన్స్ మినిస్టర్ ప్రిపేర్ అవుతున్నాడని అని సభ ఆపేస్తారు. అసలు సభకు వచ్చి ప్రిపేర్ అవుతారా, ప్రిపేర్ అయ్యాక సభకు వస్తారా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఒకరోజు విద్యుత్ ఉద్యోగులకు చెక్కులు ఇవ్వాలని 4 గంటలు వృథా చేశారని.. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృథా చేశారన్నారు.కేరళ ఎన్నికల కోసం శాసనసభని 30వ తేదీనే బంద్ పెట్టారు. కేరళ ఎన్నికలు మీకు అవసరం ఏమో..? తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి శాసనసభ ముఖ్యం, ప్రజా సమస్యలు ముఖ్యమని హరీష్ రావు స్పష్టం చేశారు. శాసనసభలో పహిల్వాన్లు అని రేవంత్ రెడ్డి అంటాడు, కత్తులతో తలలు తీసేస్తామని ఇంకో సభ్యుడు అంటాడు. మరి ఇవన్నీ ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయరా..? కాంగ్రెస్ సర్కార్‌ను హరీష్ రావు ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు అనాగరిక భాష మాట్లాడాడు, మరి అది రిఫర్ చేయరా ఎథిక్స్ కమిటీకి..? అని అడిగారు. మీరు అసెంబ్లీలో మా గొంతు నొక్కే ప్రయత్నం చేసినా, ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటామని హరీష్ రావు హెచ్చరించారు.

## కుట్రపూరితంగా మేడిగడ్డ పిల్లర్ల కూల్చివేత.. అది యుద్ధ నేరం




**హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి అటెన్షన్‌ను డైవర్ట్ చేయడంలో సిద్ధహస్తుడు. మీకు ఎన్ని ఉదాహరణలు కావాలంటే అన్ని చెప్తానని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్, మేడిగడ్డలో పిల్లర్ల కూల్చివేత అవేనని.. మేడిగడ్డ పిల్లర్ నంబర్ 20,21లు కూలిపోలేదు. వాటిని కుట్రపూరితంగా కూల్చేశారు. అది యుద్ధ నేరం. ఏ ప్రాజెక్టును ఏ దేశంలో కూల్చినా యుద్ధనేరమే. దాన్ని ఎందుకోసం రిపేర్ చేయడం లేదు మరి.. ఇసుక కోసం.. ఆంధ్రా ప్రాంతానికి ప్రయోజనం చేకూర్చాలే, పోలవరం నుంచి బనకచర్లకు నీళ్లు పోవాలంటే మేడిగడ్డ రిపేర్ కాకూడదు. అక్కడి నుంచి నీళ్లు కంటిన్యూగా పోలవరం దాకా పోతే అక్కడ నీటిని తీసుకెళ్లి బనక చర్లకు చేరాలే. కాగల కార్యం గంధర్వులే నెరవేర్చినట్టుగా చంద్రబాబు నాయుడు ఒక ప్రాక్సీ ముఖ్యమంత్రిని ఇక్కడ పెట్టుకున్నారు. ఆ కుట్రలో భాగమే ఆదిత్యానాథ్ దాస్ ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేసిన ఒక అధికారిని తీసుకొచ్చి.. సూచనలన్నీ ఆయనుకు ఇస్తే.. ఆయన ఇవన్నీ రేవంత్ రెడ్డికి చెప్పి ఇవన్నీ కూడా చేయిస్తుండని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.వెనిజువెలా నికోలస్ మధురోను డొనాల్డ్ ట్రంప్ తీసుకెళ్లి ఆయనను అరెస్ట్ చేసి అమెరికాలో పెట్టుకొని.. వెనిజువెలా ఆయిల్ మీద అమెరికా ఎట్లయితే మొత్తం కూడా ఏక ఛత్రాధిపత్యం చేసి ప్రపంచమార్కెట్‌లో ఒక స్వతంత్ర దేశానికి చెందిన ఆయిల్‌ను ఒక ప్రాక్సీని పెట్టి ఏవిధంగా ప్రపంచమార్కెట్‌లో అమ్ముకుంటున్నదో.. ఆవిధంగా ఇవాళ చంద్రబాబు నాయుడు రేవంత్ రెడ్డిని సీఎంగా పెట్టుకొని తెలంగాణ ప్రజల నోట్లో మట్టి కొడుతున్నడన్న విషయం తెలంగాణ ప్రజలు గుర్తించాలని హితవు పలికారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చుట్టూ బిగుస్తోన్న ఉచ్చు..
## అనుచిత వ్యాఖ్యల కేసులో సీఐడీ నోటీసులు



**కరీంనగర్, మార్చి 31:** హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి చిక్కులు తప్పటం లేదు. ఇప్పటికే అసెంబ్లీలో కడియం శ్రీహరిని బెదిరించారన్న ఆరోపణలతో ఆయనపై చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. తాజాగా.. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు జారీ చేసింది. వచ్చే నెల ఏప్రిల్ 4న హైదరా బాద్‌లోని సీఐడీ ప్రధాన కార్యాలయ ంలో విచారణకు హాజరు కావాలని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 29న వీణవంక మండలంలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంగా బందోబస్తులో ఉన్న పోలీసులకు, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు తనను, తన కుటుంబాన్ని జాతర వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారని కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను ఉద్దేశించి ఆయన మతంపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఈ కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఈ క్రమం లోనే సీఐడీ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేసారు. ఏప్రిల్ 4న జరిగే తీసుకోనున్నారు. గత కొంతకాలంగా అధికార పక్షంపై నిప్పులు చెరుగుతున్న కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు రావడం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. ఇది కక్షపూరిత చర్య అని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని అంటోంది.ఈ నోటీసులపై పాడి కౌశిక్ రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. ప్రశ్నించే గొంతును అణచలేరని.. ప్రజల కోసం తన పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. ఏ తప్పు చేయకపోయినా నోటీసులు పంపారని.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. తాను వెనక్కి తగ్గేది లేదని ట్వీట్ చేశారు. 'ఏ తప్పు చేయకపోయినా ఏదో ఒక విధంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో నాకు, నా కుటుంబానికి, మా దీ=ా కుటుంబ సభ్యులకు నోటీసులు ఇవ్వడం ఎంతో బాధ కలిగించింది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కారణంతో నా కుటుంబ సభ్యులను ,మా దీ=ా కుటుంబ సభ్యులను ఇలా బెదిరింపులకు గురిచేయడం తగునా రాజకీయాలు నాపై చేయండి.. కానీ నా కుటుంబాన్ని, మా దీ=ా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం?రేవంత్ రెడ్డి గారు.. నన్ను లక్ష్యంగా చేసుకోండి.. నాపై కేసులు పెట్టండి.. నాకు నోటీసులు ఇవ్వండి.. కానీ నా కుటుంబాన్ని, నా దీ=ా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టడం మాత్రం బాధాకరం. అయినా సరే.. నన్ను ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. నేను వెనక్కి తగ్గను. మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు.. ప్రజల తరఫున మిమ్మల్ని ప్రశ్నిస్తూనే ఉంటాను. నిలదీస్తూనే ఉంటాను. ఇది నా వ్యక్తిగత పోరాటం కాదు. ప్రజల కోసం చేసే బాధ్యత. ప్రశ్నించే గొంతును అణచలేరు..ప్రజల కోసం నా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.' అని కౌశిక్ రెడ్డి ట్వీట్ చేశారు.

## రైతులకు గుడ్ న్యూస్.. మంత్రి కీలక ఆదేశాలు



**హైదరాబాద్, మార్చి 31:** పసుపు రైతులకు ఊరటనిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలతో పసుపు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని చెప్పారు. తడిసిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులను హెచ్చరించారు. మార్కెట్ యార్డు అధికారులు రైతులను ఇబ్బంది పెడితే.. కఠిన చర్యలు తీసుకుంటామంటూ మంత్రి తుమ్మల వార్నింగ్ ఇచ్చారు.మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. నిజామాబాద్ మార్కెట్‌కు భారీగా పసుపు వచ్చిందన్నారు. 4,500 కుప్పలు (27,400 బస్తాలు) యార్డుకు చేరిందన్నారు. 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉందని చెప్పిన మంత్రి.. పసుపు రక్షణకు 1,500 టార్పాలిన్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గాలులు, వర్షాలతో 70 - 80 కుప్పలు తడిశాయన్నారు. దీని కారణంగా దాదాపు 40 మంది రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన పసుపును పూర్తి తూకంతో కొనుగోలు చేయాలని మార్కెట్ యార్డ్ అధికారులను ఆదేశించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

## ఆమనగల్లులో దారుణం.. భార్య, పిల్లలపై దాడి కొడుకు, భార్య మృతి



**ఆమనగల్లు, మార్చి 31 :** కుటుంబ తగాదాలు, మద్యం మత్తు కారణంగా విచక్షణ కోల్పోయిన ఓ వ్యక్తి కట్టుకున్న భార్య, కన్న కొడుకు, కూతురిపై రోకలి బండతో దాడి చేశారు. ఈ దాడిలో భార్య, కుమారుడు చనిపోగా తీవ్ర గాయాలతో కూతురు ఉస్మానియా ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఈ విషా దకర సంఘటన రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆమనగల్లు మండలం సీతారాం నగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని పులిగోని పల్లి తండాకు చెందిన బాణావత్ రాందాస్ నాయక్ కు భార్య కవిత (28)తోపాటు ముగ్గురు ఆడపిల్లలు ప్రణీత (8) పావని (10) పవిత్ర (11) పావని, మగ సంతానం కుమారుడు హర్షిత్ (5) ఉన్నారు.పవిత్ర, పావని ఇద్దరు ఆడపిల్లలు హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నారు. కాగా, మద్యానికి బానిసైన రాందాస్ తరచు భార్యతో గొడవపడేవారని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి మద్యం మత్తులో మరోసారి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మత్తులో ఉన్న రాందాస్ భార్య కవిత, కుమారుడు హర్షిత్, కూతురు ప్రణీతపై రోకలిబండ, కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు తెలుస్తుంది. దాడిలో కవిత, కుమారుడు హర్షిత్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే కన్నుమూయాగ, తీవ్రంగా గాయపడిన ప్రణీత ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

## కల్తీసారా తాగొద్దంటే బద్నాం చేస్తారా?..
## ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫైర్



**హైదరాబాద్, మార్చి 31:** తనపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. కల్తీసారా తాగకండి అంటే తనను బద్నాం చేస్తారా? అంటూ తనపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులకు ప్రైవసీ అనేది లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఆదివాసీలు లిక్కర్ తయారుచేస్తే తప్పా? కార్పొరేట్ కంపెనీలు చేస్తే కరెక్టా? అని ఆయన ప్రశ్నించారు. ఇప్పసారాకు 3 వేల ఏళ్ల చరిత్ర ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఇప్పసారా ఇండియన్ లిక్కర్ అని ఆయన అభివర్ణించారు.ఈ సందర్భంగా సినీతారలపై అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను డ్రగ్ టెస్ట్ చేయించుకున్నానని.. అలాగే సినీతారలు కూడా టెస్ట్ చేయించుకోవాలని ఆయన సూచించారు. వారిపైనే అధికంగా డ్రగ్స్ ర్యూమర్స్ ఉన్నాయని గుర్తుచేశారు. కానీ రాజకీయ నాయకులపై ఈ పుకార్లు తక్కువేనన్నారు. ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్ టెస్ట్ చేయించుకోవాలంటూ సినీనటులకు సూచించారు. డ్రగ్ టెస్ట్‌లో నెగెటివ్ వస్తేనే షూటింగ్స్‌లో పాల్గొనేందుకు అనుమతించాలని ఆయన స్పష్టం చేశారు.డ్రగ్స్ బారినపడిన వారు చిత్ర పరిశ్రమలలోనే అధికంగా ఉన్నారని ప్రజలు భావిస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. సీఎం రేవంత్ మద్యం, ధూమం వంటివాటికి దూరంగా ఉంటారన్నా రు. తాము కూడా డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనుకుంటున్నామని అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు.ఇప్పసారాకు శతాబ్దాల చరిత్ర ఉందని అనిరుధ్‌రెడ్డి ఇటీవల వెల్లడించారు. ఈ రకమైన సారా తాగడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. గతంలో దీన్ని తాగి 110 ఏళ్లు బతికారని ఆయన వివరించారు. అనిరుధ్ వ్యాఖ్యలపై ప్రజలు తమదైన శైలిలో సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు.

# ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటాం




**అమరావతి, మార్చి 31:** కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో బాణసంచా ప్రమాద బాధితులను మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలవడం పట్ల మంత్రి విచారం వ్యక్తం చేశారు. మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిం చారు. మెరుగైన వైద్య సదుపాయం కల్పించా లని డాక్టర్లకు సూచించారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు మంత్రి హామీ ఇచ్చారు.దీపావళి సమయంలో అక్రమ వ్యాపారం చేసిన వారి వద్ద స్వాధీనం చేసుకున్న టపాసులను తరలిస్తున్న సమయంలో ప్రమాదం జరిగిందని మంత్రి తెలిపారు. ముగ్గురు కూడా వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని చెప్పారు. బాధితులకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఉదయం చల్లపల్లి పోలీస్ వాహనంలో పేలుడు సంభవించింది. దీపావళి సందర్భంగా సీజ్ చేసిన టపాసులను పోలీసు వాహనంలో తరలిస్తుండగా ప్రమాదం జరిగింది. వాహనంలోని టపాసులు ఒక్కసారిగా పేలడంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఎస్సై సహా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

# తుంగభద్ర డ్యామ్ గేట్ల పనులను పరిశీలించిన మంత్రి పయ్యావుల కేశవ్



**అమరావతి, మార్చి 31:** తుంగభద్ర డ్యామ్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గేట్లను మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు (మంగళవారం) పరిశీలించారు. తుంగభద్ర డ్యామ్ సైట్ నుంచి సీఎం చంద్రబాబుకు మంత్రి ఫోన్ చేశారు. డ్యాం సైట్ నుంచే కొత్త గేట్లు అమర్చేందుకు జరుగుతున్న పనులను సీఎంకు ఆర్థిక మంత్రి వివరించారు. గేట్ల బిగింపు ప్రక్రియ పూర్తి కావడానికి ఇంకా ఎన్ని రోజుల సమయం పడుతుందని మంత్రి పయ్యావులను సీఎం అడిగారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి తుంగభద్ర గేట్ల బిగింపు పనులు పూర్తి కానున్నట్టు మంత్రి చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో కర్ణాటక ప్రభుత్వం కూడా త్వరితగతిన పనులు చేపట్టిందని సీఎంకు పయ్యావుల కేశవ్ వివరించారు. గేట్ల బిగింపు పనులు పూర్తైతే కర్నూలు, అనంతపురం జిల్లాకు మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. సీమ జిల్లాలకు మేలు కలిగేలా తుంగభద్ర గేట్ల బిగింపునకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించినందుకు సీఎంకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు స్ఫూర్తితోనే: మంత్రి పయ్యావుల కేశవ్తుంగభద్ర డ్యామ్ గేట్ కొట్టుకుపోతే కళ్ళల్లో నీళ్లు వచ్చాయని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. డ్యామ్ వద్ద నుంచి మీడియాతో మాట్లాడుతూ. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తే.. రైతుల ప్రయోజనాలు కాపాడాలని ఆదేశించారని తెలిపారు. గేట్లు మొత్తం తుప్పుపట్టాయని.. చేత్తో ముట్టుకుంటే విరిగిపోతున్నాయని అన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడటం కోసం కొత్త గేట్లను అమర్చేందుకు గో ఆల్ అవుట్ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళ్ళాలని సూచించారన్నారు. తుంగభద్ర డ్యామ్ గేట్లు ఉన్నంత పొడవు దేశంలో మరో ప్రాజెక్టుకు లేవన్నారు. ఒక్క సీజన్‌లో రైతుల ప్రయోజనాల కోసం ఇప్పటికే 18 కొత్త గేట్లు అమర్చామని చెప్పారు. భేషజాలకు పోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు.. కర్ణాటకకు వచ్చి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కాలువ ఆధునీకరణపై చర్చలు జరిపారన్నారు. రైతుల ప్రయోజనాలు శాశ్వతమని. అందుకే తుంగభద్ర డ్యామ్ గేట్లతో పాటు చైన్‌లను మార్చుతున్నామని చెప్పారు. ఇప్పటికే 18 గేట్లను అమర్చామని.. మొత్తం 33 గేట్లను అమర్చి కాలువ మీద ఉండే రైతులకు నమ్మకం కలిగిస్తామని అన్నారు. అనంతపురం జిల్లా ప్రజల రుణం తీర్చుకోవడానికి అనునిత్యం పని చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన గో ఆల్ అవుట్ స్ఫూర్తితోనే గేట్లను అమర్చగలిగామని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.ఇది అద్భుత ఘట్టం: కాలవ శ్రీనివాసులుతుంగభద్ర రిజర్వాయర్ చరిత్రలో ఇది అద్భుత ఘట్టమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. పాత తుప్పుపట్టిన గేట్ల స్థానంలో కొత్త గేట్లను అమర్చడం అనేది కాస్త కష్ట సాధ్యమైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో పూర్తి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో విపక్షం విషపక్షంలా మారిందని.. రాయలసీమ పట్ల చిత్తశుద్ధితో టీడీపీ పనిచేస్తుందని స్పష్టం చేశారు. రాయలసీమకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు 20 నెలల్లో 8 వేల కోట్ల రూపాయలు రాయలసీమ ప్రాజెక్టులకు ఖర్చు చేశామని కాలవ శ్రీనివాసులు వెల్లడించారు.

# మెరుగైన ప్రజారోగ్యం కోసం గ్రామసభలు, క్యాంపులు - 5 పిల్లర్లతో 'ఏపీ హెల్త్ మేనేజ్‌మెంట్ పాలసీ'



**చిత్తూరు జిల్లా,:** మెరుగైన ప్రజారోగ్యం కోసం అందరూ ఉద్యమంలా కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఏప్రిల్ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వైద్యాధికారులు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రతీ నెల 4వ శనివారం 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్' గ్రామస భలు, హెల్త్ క్యాంపులు, అవగాహనా కార్యక్ర మాలను నిర్వహించాలని సూచించారు. సంజీ వని ప్రాజెక్టుపై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీ క్షలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యా దవ్, సీఎస్ సాయిప్రసాద్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ పాల్గొ న్నారు.ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం, నారావారిపల్లెలో సమర్ధవంతంగా అమలు అవ ుతోన్న ఈ ప్రాజెక్టును జూలై కల్లా రాష్ట్రమంతటా అమలయ్యేలా చూడాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు జరపా లనే లక్ష్యాన్ని అధికారులకు సీఎం నిర్దేశించారు. వైద్య పరీక్షల ఫలితాలను వాట్సప్ ద్వారా నేరుగా 48 గంటల్లో వారికి అందించాలని చెప్పారు. అయితే ఇందుకోసం 904 మొబైల్ మెడికల్ యూన్సిట్ అవసరం కానున్నాయని రూ.162 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు వివరించగా అందుకు సీఎం అంగీకారం తెలిపారు.రాష్ట్రంలో ఇప్పటివరకు 3.14 లక్షల మంది సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ డేటాబేస్‌లో నమోదు చేసుకున్నారని అధికారులు సీఎంకి వివరించారు. వ్యక్తిగత హెల్త్ రికార్డ్ ఎప్పటికప్పుడు అప్?డేట్? అయ్యే లా చూడాలని సీఎం అన్నారు. భవిష్యత్‌లో వైద్య ఖర్చులు తగ్గేలా సేవలు అందించగలగాలని, ప్రివెంటివ్ హెల్త్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. యోగా, న్యూట్రిషన్, మెడిటేషన్, ప్రాణాయామం వంటివి తప్పనిసరిగా అనుసరించడం వల్ల చాలా వరకు ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. సంజీవని ప్రాజెక్టు అమలవుతున్న చిత్తూరు జిల్లాలో ప్రజారోగ్యం ఏమేరకు మెరుగయ్యిందో పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు.వైద్యారోగ్య శాఖలో ఎక్కడా ఖాళీలు ఉండకూడదు: మాతృత్వ, శక్తి, నైపుణ్యం, క్షేమ, సంజీవని ఈ 5 పిల్లర్లతో త్వరలో 'ఏపీ హెల్త్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకురావాలని అధికారులకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. త్వరలో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలుపైనా సమీక్షించారు. యూనివర్సల్ హెల్త్ పాలసీలో భాగస్వామి అయ్యేందుకు పలు బీమా సంస్థలు ముందుకు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. పీపీపీ విధానంలో చేపట్టదలచిన మెడికల్ కాలేజీల నిర్మాణంపై చర్చించారు.వైద్యారోగ్య శాఖలో ఎక్కడా ఖాళీలు ఉండకూడదని, రేషనలైజేషన్ ద్వారా ఖాళీలు ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఫార్మసీ నెట్వర్క్, ల్యాబొరేటరీ ఇంట్రిగ్రేషన్ జరగాలని అనారోగ్య సమస్యలు, అత్యవసర వైద్య పరిస్థితులు, వైద్య బృందం సూచనల మేరకు మాత్రమే గర్భిణులకు ఇకపై సిజేరియన్లు చేయాలని మిగిలిన సమయంలో నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశిం చారు. 20 శాతానికి మించి సిజేరియన్లు జరిగితే ఆడిటింగ్ చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.

# చల్లపల్లి పేలుడు ఘటనపై విచారణకు మంత్రి వాసంశెట్టి సుభాశ్ ఆదేశం





**అమరావతి, మార్చి 31:** కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన టపాసులు పేలిన ఘటనపై ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాశ్ స్పందిస్తూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనలో గాయపడిన పోలీసు సిబ్బందికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారు లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదానికి గల కారణాలను తక్షణమే తెలుసుకుని పూర్తి స్థాయి విచారణ జరపాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీస్ స్టేషన్లలో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని మంత్రి ఆదేశించారు.సీజ్ చేసిన పేలుడు పదార్థాల నిల్వలో నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించా రు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుం దని భరోసా ఇచ్చారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిపై సమీక్షించారు. ప్రమాదానికి గురైన ప్రాంగణంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల్లో ఎలాంటి భయం అవస రం లేదని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని మంత్రి స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా ఎస్పీతో మంత్రి వాసంశెట్టి సుభాశ్ ఫోన్లో మాట్లాడి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుటున్నారు.

# చల్లపల్లి పేలుడు ఘటనపై స్పందించిన హోంమంత్రి అనిత



**కృష్ణా జిల్లా:** చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన వాహనంలో పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. సీజ్ చేసిన టపాసులను తరలిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఎస్సై సహా నలుగురు పోలీసు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వివరాలు వెల్లడించారు. గతంలో స్వాధీనం చేసుకున్న టపాసులను స్టేషన్‌కు దూరంగా ఉన్న ఒక షెడ్‌లో భద్రపరిచినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు వాటిని నిర్వీర్యం చేయడానికి తీసుకెళ్తుండగా ఈ పేలుడు జరిగినట్లు చెప్పారు.ప్రమాదంలో మొత్తం ఐదుగురు పోలీసు సిబ్బంది గాయపడగా, వారిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్పీ తెలిపారు. గాయపడిన వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం స్థిరంగా ఉందని, ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై అంతర్గతంగా పూర్తిస్థాయి విచారణ చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామ ని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, చల్లపల్లి పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన పేలుడుపై హోంమంత్రి అనిత స్పందించారు. జిల్లా ఎస్పీతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# అమరావతి చట్టబద్ధత బిల్లు - లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్ర హోంశాఖ



ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం దిశగా కీలక అడుగు పడింది. (బుధవారం) పార్లమెంట్ ముందుకు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు రానునుంది. దీని ద్వారా ఏపీకి అమరావతి ఏకైక రాజధానిగా గుర్తింపు లభించనుంది. ఇందుకు అనుగుణంగా బుధవారం లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవ స్థీకరణ బిల్లు, 2026 బిల్లును కేంద్ర హోంశాఖ ప్రవేశ పెట్టనుంది. దీనిపై ఈ నెల 28న రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది.రాష్ట్ర ప్రభుత్వ తీర్మానానికి అనుగు ణంగా బిల్లును పార్లమెంట్?లో ప్రవేశపె ట్టేందుకు కేంద్రం ముందడుగు వేసింది. లోక్‌స బిజినెస్ జాబితాలో ఈ మేర చట్టసవరణ బిల్లు డ్రాఫ్ట్ అప్లోడ్ చేశారు. లోక్‌సభ ఆమోదం తర్వాత రాజ్యసభ ముందుకు ఈ బిల్లు వెళ్లనుంది. ఉభయ సభల ఆమోదం తర్వాత రాజపత్రం (గెజిట్) విడుదల కానుంది. దీంతో అమరావతికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అధికారికంగా గుర్తింపు దక్కుతుంది.కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వివరణ: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవసీ కరణ చట్టసవరణ బిల్లు లక్ష్యాలు, కారణాలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వివరణ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీక రణ చట్టం- 2014లో సెక్షన్ 5 ప్రకారం, నిర్ణీత తేదీ నుంచి 10 ఏళ్లపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు హైదరాబాద్ సంయుక్త రాజధానిగా ఉంటుందని తెలిపారు. ఆ కాలం పూర్తయ్యాక హైదరాబాద్ తెలంగాణ రాజధానిగా కొనసాగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఏర్పాటవ్వాలని తెలిపారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర పరిశీలన, సంప్రదింపులు, ప్రణాళికల అనంతరం "అమరావతి" ని కొత్త రాజధానిగా గుర్తించి ప్రకటించిందన్నారు.అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఏర్పాటు చేసే లక్ష్యంతో అక్కడ మౌలిక వసతుల అభివృద్ధితోపాటు పలు పరిపాలనా శాసన చర్యలు చేపట్టబడ్డాయన్నా రు. 2026 మార్చి 28న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఈ మేర తీర్మానం ఆమోదించింద న్నారు. విభజన చట్టంలోని సెక్షన్-5ను సవరిం చి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధానిగా "అమరావతి" పేరును చేర్చాలని భారత ప్రభుత్వాన్ని కోరిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ తీర్మానానికి అమలు చేస్తూ రాష్ట్ర రాజధాని విషయంలో చట్టబద్ధమైన స్పష్టత ఇవ్వడానికి ఆ చట్టంలోని సెక్షన్ 5లోని ఉపవి భాగం (2)ను సవరించి, "అమరావతి" పేరును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధానిగా చేర్చాలని ప్రతిపాదిం చబడిందని వివరించారు. ఈ మార్పు 2024 జూన్ 2 నుంచి అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించబడుతుందని అమిత్‌షా వెల్లడించారు.అమరావతి రాజధాని పరిణామాలు: 2014 జూన్ 2వ తేదీన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ద్వారా రాష్ట్ర విభజన జరిగింది. కానీ హైదరాబాద్ 10 ఏళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని అప్పట్లో నిర్ణయించారు. 2014 సెప్టెంబర్?లో ఏపీ నూతన రాజధానిగా అమరావతి అని అప్పటి సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ క్రమంలో 2015 అక్టోబర్ 22న ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2016-2019 మధ్య వెలగపూడిలో తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ భవనాలు పూర్తి చేసి పరిపాలన ప్రారంభించారు. రాజధాని కోసం సింగపూర్ సంస్థల భాగస్వామ్యంతో మాస్టర్ ప్లాన్ రూపొందించి మౌలిక సదుపాయాల పనులు చేపట్టారు. జూన్? 2016న హైదరాబాద్?లోని సచివాలయం నుంచి పరిపాలనను ఏపీకి తరలించే ప్రక్రియ ఊపందుకుంది. అలాగే అప్పుడే ఉద్యోగుల తరలింపు ప్రారంభమైంది. అక్టోబర్ 2016న వెలగపూడిలో రికార్డు స్థాయిలో కేవలం కొన్ని నెలల్లోనే నిర్మించిన తాత్కాలిక సచివాలయ భవనాలు ప్రారంభమ య్యాయి. అక్కడి నుంచే పూర్తిస్థాయి పరిపాలన మొదలైంది. 2017 ఫిబ్రవరిలో అమరావతిలో తాత్కాలిక అసెంబ్లీ భవనం ప్రారంభమవగా శాసనసభ సమావేశాలు మొదటిసారిగా అక్కడ నిర్వహించారు. 2018లో శాశ్వత ప్రభుత్వ భవనాల డిజైన్లను ప్రభుత్వం ఖరారు చేయగా సచివాలయం కోసం 2 ఐకానిక్? టవర్ల (×షశీఅఱష ౣశీషవతీం) నిర్మాణానికి పునాదులు పడ్డాయి. 2019 ఫిబ్రవరిలో తాత్కాలిక హైకోర్టు భవనం ప్రారంభించగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీనిని ప్రారంభించారు.

# వదంతుల కారణంగానే ఇబ్బందులు తలెత్తాయి



**విజయవాడ, మార్చి31:** వదంతుల కారణంగా ఒకే సారి ఐదు లక్షల గ్యాస్ బుకింగ్‌లు కావడంతో ఇబ్బందులు తలెత్తాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ సరఫరాపై అనేక అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మంగళవారం గ్యాస్, ఆయిల్ డీలర్లు, ఉన్నతాధికారులతో మంత్రి నాదెండ్ల మనోహన్ సమావేశమయ్యారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. సరఫరా విషయంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బ ంది లేదన్నారు. డొమెస్టిక్ గ్యాస్‌కు సంబంధించి 16 ఏజెన్సీల నుంచి డెలివరీ విషయంలో జాప్యం జరుగుతుందని వివరించారు.ఈ సమ స్యలను వెంటనే నివారించాలని వారికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. బ్లాక్ మార్కెటింగ్ చేసే 146 గ్యాస్ ఏజెన్సీలపై సెక్షన్ 6 ఏ కింద కేసులు నమోదు చేశామని చెప్పారు. అందుకు సంబంధించి 4 వేలకుపైగా గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడు ఆయిల్ కంపెనీలతో ప్రతిరోజూ మాట్లాడి గ్యాస్ కొరత లేకుండా చేస్తున్నామని తెలిపారు. మంగళవారం నుంచి కమర్షియల్ గ్యాస్ వినియోగానికి 70 శాతం వరకు సరఫరా చేసేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. గృహ వినియోగానికి నగరాల్లో 25 రోజులు, గ్రామాల్లో 45 రోజుల తర్వాత గ్యాస్ బుక్ చేసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలపై ఇప్పటికే సమీక్షించామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. మన రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ పుష్కలంగా ఉందని తెలిపారు. 7,900 లీటర్ల పెట్రోల్, 20 వేల లీటర్ల డీజిల్ మనకు రోజు వారీ అవసరంగా ఉందని చెప్పారు. ఈ సమస్య వచ్చిన తర్వాత డీజిల్ 8 శాతం, పెట్రోల్ 2.5 శాతం వినియోగం పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూడా ఎటువంటి కొరత లేకుండా చూస్తున్నామని పేర్కొన్నారు.ఏజెన్సీలు, గోడౌన్ల వద్దకు వెళ్లి హడావుడి చేయవద్దని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు. ఆన్ లైన్‌లో బుక్ చేసుకున్న అనంతరం వన్ టైమ్ పాస్ వర్డ్ ద్వారానే గ్యాస్ డెలివరీ జరుగుతుందని స్పష్టం చేశారు. గల్ఫ్‌లో యుద్ధం కారణంగా ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమర్షియల్ గ్యాస్ వినియోగించే వారు జిల్లాల్లోని జాయింట్ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

# ఆ ప్రైవేట్ బ్యాంక్ బ్రాంచ్‌ల్లో రూ.కోట్లలో కుచ్చుటోపీ పెట్టిన కేటుగాళ్లు




**విజయవాడ, మార్చి 31:** నగరంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌కు చెందిన మూడు వేర్వేరు శాఖల్లో కేటుగాళ్లు కుచ్చుటోపీ పెట్టారు. ఫేక్ పేస్లిప్‌లు, ఫేక్ ఆధార్ కార్డులు, ఫేక్ అడ్రస్ ప్రూఫ్‌లతో బ్యాంక్ ఖాతాలను సృష్టించారు. తద్వారా సుమారు రూ.5 కోట్ల నిధులు కొల్లగొట్టారు. ఈ విషయాన్ని గుర్తి ంచిన బ్యాంక్ ఉన్నతాధికారులు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమో దుచేసి దర్యాప్తు చేపట్టారు.నగరంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌కు చెందిన ఏలూరు రోడ్, గుణదల, బెంజ్ సర్కిల్ పరిధిలో ఉన్న ఆయా శాఖల్లో నకిలీ ఖాతాలు తెరిచారు కేటుగాళ్లు. ఆ అకౌంట్లకు అనుబ ంధంగా క్రెడిట్ కార్డుల ద్వారా రూ.5,28,19,939 నగదు లూటీ చేసినట్టు తెలుస్తోంది. ఈ మోసా లకు పాల్ప డిన దుండగులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు.

# టీవీకే అధినేత దళపతి విజయ్‌పై కేసు నమోదు

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల వేళ కీలక పరిణామం జరిగింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారనే ఆరోపణలపై తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధినేత విజయ్‌పై పెరంబూర్‌లో కేసు నమోదైంది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి 30 లౌడ్ స్పీకర్లను ఉపయోగించడం, అంబులెన్స్‌ను అడ్డుకోవడం, 5000 మందికి పైగా జనాలను పోగుచేయడం, ఇవన్నీ ప్రజలకు అసౌకర్యాన్ని కలిగించాయని ఎన్నికల పర్యవేక్షణ అధికారి ఫిర్యాదు చేసారు. దీంతో పెరంబూర్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.
సోమవారం, పెరంబూర్ నియోజకవర్గం నుంచి విజయ్? నామినేషన్ వేసిన అనంతరం రోడ్‌షో నిర్వహించారు. దాని తర్వాతే నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తెలుస్తోంది. అయితే, విజయ్‌తో పాటు దాదాపు 5000 మంది టీవీకే కార్యకర్తలపై కూడా కేసు నమోదైంది. మరోవైపు, చెన్నై పోలీసులపై టీవీకే పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ప్రచారానికి అనుమతి ఉన్నప్పటికీ ఎన్నికల ప్రచారం సజావుగా సాగేందుకు కావాల్సిన భద్రతా చర్యలను పోలీసుల తీసుకోలేదని టీవీకే ఆరోపించింది. విజయ్ ప్రచారం వాహనం ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి వెళ్లడం కష్టతరంగా మారిందని వ్యాఖ్యానించింది. అయితే, ఈ విషయంలో ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని టీవీకే కోరింది. భద్రతా, ట్రాఫిక్ నియంత్రణలు పాటించేలా చెన్నై పోలీసులను ఆదేశించాలని అభ్యర్థించింది. విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది.అధికార పార్టీ డీఎంకేతో అధికారులు కుమ్మక్కయ్యారు!ఇదిలా ఉండగా, అధికార పార్టీ డీఎంకేతో అధికారులు కుమ్మక్కై తమ ప్రచారాన్ని అడ్డుకుంటున్నారని టీవీకే ఆరోపించింది. డీఎంకే నేతలకు అనుమతులు ఇస్తూ, తమకు నిరాకరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించింది. ముఖ్యంగా సీఎం స్టాలిన్‌కు బహిరంగ వాహన ప్రచారానికి అనుమతి ఇస్తూ, తమకు ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే చర్య అని అభివర్ణించారు. ప్రచార కార్యక్రమాలకు సంబంధించి ఇలాంటి ఏకపక్ష వాతావరణాన్ని సృష్టిస్తున్న అధికారుల పట్ల ఈసీ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.ఇక, విజయ్ పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అనే రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు. పెరంబూరులో డీఎంకే అభ్యర్థి ఆర్.డీ. శేఖర్, తిరుచ్చిలో ఇనిగో ఎస్ ఇరుదయరాజ్‌కు విజయ్? గట్టిపోటీ ఇవ్వనున్నారు. అయితే, 2016 వరకు పెరంబూర్ నియోజకవర్గం సీపీఐ(ఎం)కు కంచుకోటగా ఉండేది. 2019లో జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచినప్పటినుంచి ఆర్.డీ. శేఖర్ ఈ స్థానాన్ని నిలబెట్టుకున్నారు. తమిళనాడు రాజకీయాలుకా గా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23న ఒకే దశలో జరగనున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 234 స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది. అయితే, ఎన్నికల సమయం దగ్గర పడుతున్నకొద్దీ గెలుపే లక్ష్యంగా అధికార, విపక్షాలు పావులు కదుపుతున్నాయి. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి ప్రచారం జోరుగా సాగుతోంది. అధికార డీఎంకే మరోసారి తమ పార్టీని నిలబెట్టుకోవాలని యోచిస్తోంది. ఈ ఎన్నికల్లో అధికార డీఎంకేను ఢీకొట్టేందుకు, అన్నా డీఎంకే, బీజేపీ సారథ్యంలోని విపక్ష కూటమి సిద్ధంగా ఉన్నాయి. ఈ కూటమిలో మరో 8 చిన్న పార్టీలు కూడా రేసులో ఉన్నాయి. ఇక రాష్ట్రంలో మూడో అతిపెద్ద రాజకీయ శక్తి తన పార్టీయే (టీవీకే) అని హీరో దళపతి విజయ్ అంటున్నారు. తనను తాను సీఎం అభ్యర్థిగా ప్రకటించుకున్న ఆయన, ఒంటరిపోరుకే సిద్ధమయ్యారు. ఇక దివంగత మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలు వీకే శశికళ తన కొత్త పార్టీతో ఎన్నికల బరిలోకి దిగారు. అయితే, డీఎంకే మినహా ఎవరితోనైనా చేతులు కలుపేందకు తాను సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. ఇక సెంథామిజాన్ సీమాన్‌కు చెందిన ఎన్‌టీకే పార్టీ ఒంటరి పోరాటం చేస్తోంది.



## యూసీసీ, లవ్ జిహాద్‌పై చట్టం.. ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన అసోం బీజేపీ




**అసోం:** అసోంలో ఏప్రిల్ 9న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల మేనిఫెస్టోను బీజేపీ ప్రకటించింది. రాజధాని గుహవటిలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో సీఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ సైకియా తదితరులు మేనిఫెస్టో విడుదల చేశారు. సంకల్ప పాత్ర పేరుతో రూపొందిన ఈ మేనిఫెస్టోలో బంగ్లాదేశీయులను రాష్ట్రం నుంచి పంపించడంతోపాటు యూసీసీ చట్టంపై కూడా ప్రజలకు హామీ ఇచ్చింది.మూడోసారి ఎన్నికైతే అసోం యాక్ట్ 1950 ప్రకారం రాష్ట్రం నుంచి బంగ్లాదేశీయులను తరిమేస్తామని సీఎం హిమంత బిశ్వ శర్మ అన్నారు. 24 గంటల్లోగా జిల్లా అధికారులతో కలిసి బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చిన వారిని పంపించేస్తామని ప్రకటించారు. ఒక్క అంగుళం భూమిని కూడా అసోం నుంచి వారికి ఇవ్వబోమన్నారు. అసోంలో యూసీసీ (యునిఫాం సివిల్ కోడ్) అమలు చేయడంతోపాటు, లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌ను అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. రాబేయే ఐదేళ్లలో బంగ్లాదేశీ వలసదారులైన మియాల మూలాల్ని దెబ్బతీస్తామని చెప్పారు. మేనిఫెస్టోలోని కీలక అంశాలివి. ఐదేళ్లలో అసోంను వరదల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దటం. మొదటి రెండేళ్లలో వరదల నివారణ కోసం రూ.18,000 కోట్లు కేటాయింపు. యూసీసీకి సంబంధించి ఆరో షెడ్యూల్ ప్రకారం గిరిజన ప్రాంతాలను మినహాయిస్తారు.శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక దృష్టి పెట్టడం. ఐదేళ్లలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు. ఒరునోదయ్ స్కీం రూ.1,250ని రూ.3,000కు పెంచుతారు. అలాగే రాష్ట్రంలో ఉచిత విద్యను అందిస్తారు. రోజువారీ వేతనం రూ.500కు పెంపు. రవాణా రంగానికి రూ.5 లక్షల కోట్లు కేటాయింపు. ముఖ్యమంత్రి మహిళా ఉద్యమిత స్కీం కింద మహిళలకు రూ.25,000 ఆర్థిక సాయం. వన్ డిస్ట్రిక్, వన్ ఇనిస్టిట్యూషన్ మోడల్ కింద ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్, ఒక యూనివర్సిటీ, ఒక కాలేజ్ ఏర్పాటు చేస్తారు.

## కోర్టులో విచారణ.. జడ్జి చూస్తుండగానే నిందితుడు పరార్




**యూకే :** ఓ కేసుకు సంబంధించి కోర్టులో విచారణ జరుగుతుండగానే పోలీసులు జడ్జి కళ్ల ముందు నుంచే నిందితుడు పరారయ్యాడు. ఈ అనూహ్య ఘటన యూకే లోని క్రోడాన్ క్రౌన్ కోర్టు లో చోటుచేసుకుంది. డ్రగ్స్ కేసులో విచారణ జరుగుతున్న సమయంలో నిందితుడు న్యాయస్థానం నుంచి పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియా లో వైరల్‌గా మారాయి.యూకే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మత్తు పదార్థాలకు బానిసైన 26 ఏళ్ల అబు ఫాయే ను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిపై దాదాపు పది కేసులు నమోదయ్యాయి. మాదకద్రవ్యాలను కలిగి ఉండటమే గాక.. డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన కేసుల్లో ఇటీవల అతడిని కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తాను మత్తు పదార్థాలు తీసుకుంటున్నట్లు నిందితుడు కోర్టు ముందు అంగీకరించాడు. దాంతో అతడిని పోలీసుల కస్టడీకి అప్పగించాలని జడ్జి నిర్ణయించారు.ఈ క్రమంలోనే నిందితుడు భయంతో హఠాత్తుగా కోర్టు తలుపులు తెరుచుకొని పరారయ్యాడు. దాంతో పోలీసులతోపాటు అక్కడున్నవారంతా అవాక్కయ్యారు. నిందితుడిని పట్టుకునేందుకు కోర్టు వద్ద భద్రతాసిబ్బంది ప్రయత్నించినప్పటికీ లాభం లేకుండా పోయింది. దాంతో పోలీసులు అతడి కోసం ముమ్మర గాలింపుచర్యలు చేపట్టారు. తూర్పు లండన్‌లోని హాక్నీ ప్రాంతానికి చెందిన అబు ఫాయేకి కేంబ్రిడ్జి, పెంగే ప్రాంతాలతో సంబంధాలున్నాయి. దాంతో అతడు అక్కడే నక్కి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

## దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం' - నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ ఆందోళన




దేశంలో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై దక్షిణాది కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ సీట్ల పెంపు నేపథ్యంలో దక్షిణ రాష్ట్రాలు రాజకీయంగా వెనుకబడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు.లోక్‌సభలో ప్రస్తు తం 543 సీట్లు ఉన్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సీట్ల సంఖ్యను దాదాపు 50 శాతం పెంచాలని చూస్తోంది. దీంతో 543 లోక్‌సభ స్థానాలు 816కి పెరిగే అవకాశం ఉంది. రిజర్వేషన్ కోటా కింద ఇందులో 273 సీట్లను మహిళలకు రిజర్వ్ అవుతాయి. అయితే ఈ సీట్ల పెంపు ప్రక్రియలో అసలు సమస్య ఎక్కడుందంటే, సీట్ల పునర్విభజన కోసం ఎంచుకున్న ప్రమాణాలే అని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. 2011 జనగణన ఆధారంగా సీట్లను పంచితే అధిక జనాభా ఉన్న ఉత్తర రాష్ట్రాలకు పెద్ద ఎత్తున అదనపు సీట్లు లభిస్తాయని మాణికం ఠాగూర్? అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తే నియంత్రణ పాటించిన రాష్ట్రాలను అన్యాయం జరుగుతుందన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా పోస్టులో ఆయన లెక్కలతో సహా వివరించారు.వ్యత్యాసం మరింత పెరుగుతూ! జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించడం కేటాయిసేత ఉత్తర రాష్ట్రాలు దాదాపు 200 అదనపు స్థానాలు పొందే అవకాశముంటే, దక్షిణ రాష్ట్రాలకు కేవలం 66 సీట్లు మాత్రమే పెరిగే అవకాశం ఉందన్నారు. ఇది సమానత్వానికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. ఉదాహరణగా ఉత్తరప్రదేశ్‌లో సీట్లు 80 నుంచి 120కు పెరిగే అవకాశం ఉందని, అదే సమయంలో తెలంగాణలో 17 నుంచి 26కు మాత్రమే పెరుగుతాయని చెప్పారు. దీంతో రెండు ప్రాంతాల మధ్య ఉన్న వ్యత్యాసం మరింత పెరుగుతుందని మాణికం ఠాగూర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తం చేసిన అభిప్రాయాలకు ఆయన మద్దతు తెలిపారు. డిలిమిటేషన్ కేవలం సీట్ల పెంపు కాదని, ఇది దేశ రాజకీయ శక్తి సమతౌల్యాన్ని ప్రభావితం చేసే అంశమని ఆయన అన్నారు.ఒక వ్యక్తి - ఒక ఓటు అనే సూత్రం న్యాయంగా కనిపించినా, వాస్తవ పరిస్థితుల్లో అది సమాన ప్రతినిధిత్వాన్ని ఇవ్వదని మాణికం ఠాగూర్ అభిప్రాయపడ్డారు. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలు తక్కువ సీట్లు పొందుతుండగా, జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు మరింత రాజకీయ శక్తిని పొందుతున్నాయని ఆయన విమర్శించారు. దీనివల్ల దక్షిణ రాష్ట్రాలు నిర్మాణాత్మకంగా వెనుకబడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ పరిణామం దేశ రాజకీయ సమతౌల్యాన్ని ఉత్తర రాష్ట్రాల వైపు మళ్లించే అవకాశం ఉందని కూడా చెప్పారు.ప్రజాస్వామ్యంలో అతిపెద్ద మారుఇక పార్లమెంట్ దేశంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రతినిధిత్వాన్ని కల్పించాల్సిన వేదికగా ఉండాలని మాణికం ఠాగూర్ స్పష్టం చేశారు. కేవలం సంఖ్యల ఆధారంగా శక్తి కేంద్రీకరణ జరగకూడదని, అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు ఉండాలని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం త్వరలోనే నారీ శక్తి వందన్ చట్టంలో సవరణలు, అలాగే డిలిమిటేషన్ బిల్లు తీసుకురావచ్చని సమాచారం. ఈ బిల్లులు ఆమోదం పొందితే స్వాతంత్ర్యం తర్వాత భారత ప్రజాస్వామ్యంలో అతిపెద్ద మార్పుగా ఇది నిలవనుంది.2029 సాధారణ ఎన్నికలు 816 లోక్‌సభ సీట్లపై జరిగే అవకాశముంది. దీంతో మెజారిటీ మార్క్ కూడా 272 నుంచి 409కు పెరుగుతుంది. అంతేకా కుండా మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగి 273 మంది మహిళా ఎంపీలు పార్లమెంట్‌లో ఉండే అవకాశం ఉంది. డిలిమిటేషన్ ప్రక్రియ దేశంలో కొత్తది కాదు. ఇప్పటివరకు 1952, 1963, 1973, 2002లో నాలుగు సార్లు ఈ ప్రక్రియ జరిగింది. అయితే 2002 తర్వాత లోక్‌సభ సీట్ల సంఖ్యలో మార్పు చేయలేదు. చివరిసారి 1973లో సీట్ల విస్తరణ జరిగింది.

## బిహార్ గుడిలో తొక్కిసలాట- 8 మంది భక్తులు మృతి



**బిహార్:** బిహార్‌లోని నలందలో ఘోర విషాదం జరిగింది. శీతలామాత ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 8 మంది మహిళలు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం జరిగిన ఈ ఘటనలో భారీగా భక్తులు ఒక్కసారిగా గుమిగూడటంతో తీవ్ర రద్దీ ఏర్పడి, ఆందోళనలో ఒకరిపై ఒకరు పడిపోవడంతో ప్రమాదం సంభవించినట్లుగా తెలుస్తోంది.అధిక రద్దీ కారణంగా ప్రమాదంశీతలామాత ఆలయానికి భక్తులు వస్తుంటారు. అయితే ఈసారి మహావీర జయంతి, చైత్ర మాసం చివరి మంగళవారం కావడంతో ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. ఉదయం 9 గంటల నుంచి భక్తుల రాక పెరుగుతూ వచ్చింది. ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో ఒక్కసారిగా రద్దీ పెరగడంతో భక్తులు ఒకరిపై ఒకరు పడిపోవడంతో తొక్కిసలాట జరిగింది. ఘటన సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానిక గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ఎక్స్?గ్రేషియా ప్రకటించిన సీఎంఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్ కమార్ సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.6లక్షల ఎక్స్?గ్రేషియా ప్రకటించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. మరోవైపు ఈ ప్రమాదంపై ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ, ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని చెప్పారు. గాయపడిన వారికి సరైన చికిత్స కోసం ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు.దర్యాప్తునకు ప్రభుత్వ ఆదేశాలుఈ ఘటనపై బిహార్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించడంతో పాటు, ఆలయంలో సాధారణ పరిస్థితులు త్వరగా పునరుద్ధరించాలని సూచించింది. బ్యారికేడ్లు, తగినంత పోలీసు బందోబస్తు లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. క్యూ లైన్ ఉన్నప్పటికీ భక్తులు క్రమశిక్షణ పాటించకపోవడం, నియంత్రణ లోపించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని కొందరు తెలిపారు.ఆలయంలో పూజలు తాత్కాలికంగా నిలిపివేతఘటన అనంతరం ఆలయంలో పూజలు, దర్శనాలు తాత్కాలికంగా నిలిపివేశారు. పోలీసులు భక్తులను బయటకు తరలించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. అయితే మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నలందా విశ్వవిద్యాయం స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రమాదం జరగడం ప్రాధాన్యం సంతరిం చుకుంది.

## కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ డ్రోన్ దాడి.. భారీగా చెలరేగిన మంటలు



**ఇరాన్ :** గల్ఫ్ దేశాలపై తన దాడులను తీవ్రతరం చేసింది. తాజాగా కువైట్ (కు చెందిన ఓ చమురు ట్యాంకర్ పై భీకర దాడిచేసింది. ఈ ఘటనలో భారీగా మంటలు చెలరేగాయి. కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ఈ ఘటనను ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. కువైట్‌కు చెందిన 'అల్ సల్మీ అనే భారీ ముడిచమురు నౌక దుబాయ్ పోర్టు వద్ద ఉంది.దీనిపై ఇరాన్ డ్రోన్‌తో దాడి చేయగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. వీటిని అదుపులోకి తీసుకొచ్చేందుకు రెస్క్యూ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఘటన తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ 24 మంది సిబ్బంది సురక్షితంగానే ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు ధ్రువీకరించారు. అయితే దాడి సమయంలో ట్యాంకర్ నిండా చమురు ఉన్నట్లు తెలుస్తోంది.సముద్ర జలాల్లో చమురు ఒలికే ప్రమాదం ఉందని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ ఘటనను దుబాయ్ అధికారులు కూడా ధ్రువీకరించారు. రెస్క్యూ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

## పాలస్తీనియన్‌లు ఉగ్రదాడులకు పాల్పడితే మరణదండనే..?

**ఇజ్రాయెల్ :** ఉగ్ర దాడుల ) కు పాల్పడిన పాలస్తీనీయుల కు మరణశిక్ష (విధించేలా ఇజ్రాయెల్ పార్లమెంట్ కొత్త చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. దాదాపు పన్నెండు గంటల చర్చ తర్వాత ఈ చట్టాన్ని ఆమోదించారు. ఈ చట్టం ప్రకారం.. ఉగ్రదాడులకు పాల్పడిన వారందరికీ మరణశిక్ష విధించే అధికారం అక్కడి కోర్టులకు ఉంటుంది. శిక్ష విధించిన 90 రోజులలోపు ఆ శిక్షను అమలుచేయాలి. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం న్యాయస్థానం నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తుంది. ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు ఇజ్రాయెల్ అధికారులు ప్రకటించారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లోని ఓ ప్రాంతంపై హమాస్ చేసిన ఉగ్రదాడులకు వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఆ దాడులకు పాల్పడిన నిందితులకు ఈ చట్టం వర్తించదన్నారు. ఇజ్రాయెల్ పౌరులు, నివాసితులను ఈ చట్టం నుంచి మినహాయించినప్పటికీ.. ప్రత్యేక నిబంధన ప్రకారం ఉగ్ర కార్యకలాపాలతో ఒక వ్యక్తి మరణానికి కారణమైన ఇజ్రాయెలీలకు సైతం ఈ చట్టం వర్తిస్తుందని అధికారులు వెల్లడించారు.

## మహిళల ఖాతాల్లో రూ.3000- 'లఖ్‌పతి దీదీ' కింద రూ.25000 సాయం



**అసోం:** అసోం 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార బీజేపీ మ్యానిఫెస్టో విడుదల చేసింది. మొత్తం 31 హామీలతో జాబితాను విడుదల చేసింది. ఇందులో మహిళల సాధికారతకు పెద్దపీట వేసింది. మహిళలకు 'ఒరునోదోయ్' పథకం కింద నగదు సహాయాన్ని రూ.3000కు పెంచుతామని హామీ ఇచ్చింది. అలాగే, లఖ్‌పతి దీదీ పథకం ద్వారా ?40 లక్షల మహిళలను లక్షాధికారులుగా తయారు చేసేందుకు రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపింది. అసోంను అత్యంత ప్రకాశవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే బీజేపీ లక్ష్యమని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. మంగళవారం గువహటిలో అసోం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మ్యానిఫెస్టోను కేంద్రం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్?తో కలిసి హిమంత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ప్రధాన అజెండాగా యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) అమలు చేస్తామని హిమంత ప్రకటించారు. అయితే రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ పరిధిలోని గిరిజన ప్రాంతాలకు ఇది వర్తించదని ఆయన స్పష్టం చేశారు. అలాగే లవ్ జిహాద్ పేరుతో జరుగుతున్న ఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని వరదల నుంచి విముక్తి కల్పించేందుకు తొలి రెండు సంవత్సరాల్లోనే రూ.18,000 కోట్లను ఖర్చు చేయనున్నట్లు చెప్పారు.'అసోంను అభివృద్ధి పథంలో నడిపించడమే మా లక్ష్యం'ఉద్యోగాల నియామకం గురించి కూడా హిమంత ప్రస్తావించారు. రాబోయే ఐదేళ్లలో దాదాపు 2 లక్షల ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ, యూనివర్సిటీ, ఇంజినీరింగ్ కాలేజీలను ఏర్పాటు చేస్తామన్నారు. మ్యానిఫెస్టో కార్యక్రమంలో ముఖ్యమంత్రి హిమంతతో పాటు కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్?, సర్బానంద సోనోవాల్?, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు దిలీప్? సైకియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురక్షితమైన, అసోంను అభివృద్ధి పథంలో నడిపించడమే తమ లక్ష్యమని దిలీప్ సైకియా పేర్కొన్నారు. అయితే, ఎన్నికల ప్రణాళిక రూపకల్పన కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి దాదాపు 2.45 లక్షల సూచనలు సేకరించి ఈ మేనిఫెస్టో రూపొందించినట్లు ఆయన తెలిపారు.

# భారత ఎన్నికల తీరు మారాల్సిందే !

ఎన్నికల సంస్కరణలు చేయకుండా, పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు పెంచినంత మాత్రాన భారత్ భవిష్యత్ మారదు. రాజకీయ పార్టీలకు మేలు చేసే నిర్ణయాలు తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం లేదు. ప్రధానంగా పదేపదే సభ్యులు కొందరే పార్లమెంటుకు, అసెంబ్లీలకు ఎన్నికవుతున్నారు. దీనిని అరికట్టాల్సి ఉంది. సీట్లు పెంపు తీరును తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తప్పు పడుతున్నారు. దీంతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని అంటున్నారు. దీనిపైనా చర్చించాలి. దేశంలో ప్రజలకు రాజకీయ అవకాశం రావాలి. ముఖ్యంగా దళిత, గిరిజన, మహిళలకు పెద్ద ఎత్తున అవకాశాలు రావాలి. వారిని ఈ దేశ అధికారంలో భాగస్వామ్యం చేయాలి. కానీ అలా జరగడం లేదు. కేవలం కొన్ని సీట్లు వారికి కేటాయిస్తు న్నాయి. రాకీయంగా దళితులు, గిరిజనులకు కనీసం 50శాతం సీట్లు రిజర్వ్ చేయాలి. అందులోనూ గతంలో వరుసగా ఎన్నికవుతూ వస్తున్న వారిని మళ్లీ పోటీకి దూరం చేయాలి. అలాగే రెండు ట్మ్రలకు మించి అవకాశం లేకుండా సంస్కరణలు చేయాలి. లేదా రాజ్యాంగ సవరణ చేయాలి. అప్పుడే ఇప్పుడు పాతుకు పోయిన వారు బయటకు పోతారు. పార్లమెంట్, అసెంబ్లీలో కొత్తతరం ప్రవేశిస్తుంది. కొత్తగా ఆలోచిస్తారు. ఇటీవల పార్లమెంటులో ఎన్నికల సంస్కరణలపై చర్చ తూతూ మంత్రంగా సాగింది. అసలు విషయాలను పక్కదారి పట్టించేలా చేశారు. ఇలాంటి విషయాలను ఏ ఒక్కరూ ప్రతిపాదించలేదు. అధికార బిజెపి లేదా ఎన్‌డిఎ కూడా పక్కాగా ఎన్నికల సంస్కరణల ప్రతిపాదనలు ప్రకటించడంలేదు. విపక్షనేత రాహుల్ కేవలం సర్‌ను వ్యతిరేకించడం మాత్రమే అలవాటు చేసుకున్నారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ఊరేగుతున్న రాహుల్‌కు రాజ్యాంగంలో ఏముందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఎందుకంటే ఎన్నికల ప్రక్రియ విఫలం అవుతోంది. డబ్బున్న వారే ఎన్నికవుతున్నారు. ఒక్కరే పదేపదే చట్టసభల్లో ఉంటున్నారు. వీలయితే జీవితాంతం చట్టసభ సభ్యులుగా ఉంటున్నారు. ఇక దొంగ ఓట్లను చేర్పించి, ఓట్లను చోరీ చేస్తున్నారు. పదేపదే ఎన్నికల నిర్వహణతో దేశ ఖజానాపై భారం మోపుతున్నారు. ఒకేదేశం, ఒకే ఎన్నిక అంటున్న బిజెపి కూడా దీనిపై సమగ్ర విధానం ప్రకటించడం లేదు. మన ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాలను చర్చించి, రాజ్యాంగ సవరణకు పూనుకోవాలి. ప్రధానంగా దేశానికి భారంగా మారిన పదేపదే ఎన్నికల నిర్వహణ విధానం మారాలి. అన్ని రాష్ట్రాల్లో ఒకే తడవలో ఎన్నికలు జరిగేలా చూడాలి. రాజకీయ పార్టీలు నిరంతరం ఎన్నికలు ఉండాలని కోరుకుంటున్నాయి. అలాగే తామే నిరంతరం ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో తిష్టవేయాలని చూసుకుంటున్నారు. ఇదే వీరి ఎన్నికల సంస్కరణగా ఉంది. ఇలాంటి ఎన్నికల వల్ల కొందరే ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్నారు. అలాగే ఒక వ్యక్తి రెండుచోట్ల పోటీ చేసే పద్ధతిని కూడా రద్దు చేయాలి. గతంలో రాహుల్ రెండుచోట్ పోటీ చేశారు. మోడీ చేశారు. ఇప్పుడు తమిళనాట విజయ్ కూడా రెండుచోట్ల పోటీ చేస్తున్నారు. దీనివల్ల కూడా ఖజానాపై భారం పడుతుంది. ఇలాంటి విషయాల్లో అన్ని పార్టీలది ఒకటే దారిగా ఉంది. ఎందుకంటే ప్రజాస్వామ్యం ముసుగులో నేతలు నియంతలుగా మారుతున్నారు. ఈ క ÷-రమంలో ఇప్పుడు పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు పెరగడం వల్ల మరికొందరు చట్టసభల్లోకి వస్తారు. దీంతో ఖజానాపై మరింత భారం పడుతుంది. అలాగే వారికి సౌకర్యాలు పెరుగుతాయి. అందువల్ల ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు, జీతభత్యాలు, పెన్షన్లను కూడా రద్దు చేయాలి. ఒక్కో ప్రజాప్రతినిధి రెండేసి పెన్షన్లు కూడా పొందుతున్నారు. పార్లమెంటుకు పనిచేసి, అసెంబ్లీకి ఎన్నికైన వారు రెండుచోట్లా పెన్షన్లు పొందుతున్నారు. అందుకే చట్టసభలకు తప్ప, సభ్యులకు అధికారాలే తక్కువగా ఉంటే సమస్య రాదు. చట్టసభలకు ఎన్నికైన సభ్యులకు అలవిమాలిన సౌకర్యాలను కూడా తగ్గించాలి. పెన్షన్లు తక్షణం ఎత్తేయాలి. 2026 జనాభా గణన ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఒకే దేశం, ఒకేఎన్నిక అంటే పార్లమెంటు, రాష్ట్ర శానసభలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ జరగాలి. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ జరగాల్సిందే. అలాగే దొంగ ఓట్లు లేకుండా పక్కాగా ఓటరు కార్డు ఉండాలి. నిరంతరం ఓటరు జాబితాను సమీక్షించే



విధానం రావాలి. ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటేసేలా చట్టబద్దత ఉండాలి. నేతలు రెండు పర్యాయాలకు మించి పోటీ చేసే అవకాశం లేకుండా చూడాలి. ఒక దేశం, ఒక ఎన్నిక అనేది బీజేపీకి ప్రయోజనాలను సమకూరుస్తుందనే వాదనలో పసలేదు. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల అధికారంలో ఉన్న పార్టీకి పరిస్థితులు అనుకూలమవుతాయని వితండ వాదనతో దీనిని వ్యతిరేకిస్తున్నారు. అందుకే ఎన్నికల సంస్కరణ అనేది ఓటర్లకు సంబంధించినది మాత్రమే కాదు. యావత్తు భారత జాతికి సంబంధించినది. ఇది పార్లమెంటులో ప్రస్తుతం ఉన్న ఎంపిల వ్యవహారం అస్సలు కానేకాదు. తమను అత్యున్నత చట్టసభకు తీసుకువచ్చి, తద్వారా అధికారాన్ని అప్పగించిన ఓటర్లు తమ ఓటు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సి ఉంది. పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం నియమ నిబంధనలను మార్చాల్సిన ఆవశ్యకత విషయమై పార్లమెంటేరియన్లంతా చర్చించాలి. అలాగే ఎన్నికలలో ధనబలం, కండబలం ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకురావాల్సిన చట్టాల గురించీ చర్చించాలి. ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికత చాలా ముఖ్యం అన్న విషయం ఇక్కడ గుర్తించాలి. ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాల కారణంగా రాజకీయ నేతలు అనుసరిస్తున్న వికృతాలను నిరోధించేందుకు పార్లమెంటు చర్చించడం కూడా ముఖ్యం. ప్రధానంగా ప్రజల భాగస్వామ్యం పెరగాలి. పేదలైన ప్రజలకు చట్టసభలో ప్రవేశించే అవకాశం రావాలి. అవసరమైతే ఇందుకు నిబంధనలు లేదా రిజర్వేషన్లు పెట్టాలి. చట్టసభల్లో నిరంతరం కొత్తవాళ్లు ఎన్నికలైతేనే అవినీతి, మోనోపలి తగ్గుతుంది.




గౌ॥శ్రీ ఎస్.కె. అబేద్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
APRIL
01

# భావోద్వేగాల సయ్యాట

వలలో చిక్కిన చేపలా..
భావోద్వేగాల వలలో చిక్కి..
నరకయాతన పడుతున్నాడు..
నడవంత్రపు నరపుంగవుడు !

పక్కోడి వస్తువు మనకు నచ్చుతుంది
మన వద్ద ఉన్న దాని విలువ తెలియదు
కోల్పోతేనే మనిషి లోటు లోతు తెలుస్తుంది

మాటలు కరువైతేనే మౌనభాష వ్యక్తం !

ప్రవహిస్తేనే విలువ పెరుగుతుంది
నదీ జలాలు వినియోగ ధారలు
సముద్ర జలాలు చూపులకే అందాలు
చురుకైన వ్యక్తులే సమాజ నిర్మాతలు !

మధుపాళీ

# శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నందు హుండీ ఆదాయం 76 లక్షలు....





**ఎన్టీఆర్ డిస్టిక్ మార్చి 31** పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఈరోజు హుండీ లెక్కింపు జరిగినది,48 రోజులకు గాను శ్రీ తిరుపతమ్మ అమ్మవారి సాధారణ ఖాతా ద్వారా 76,38,287/- రాగా మిశ్రమ బంగారం:-20 గ్రాములు, మిశ్రమ వెండి:-375 గ్రాములు వచ్చింది అని,విదేశీ కరెన్సీ యుఎస్ఏ:-34,సౌదీ రియల్స్:-5,మలేషియా రింగ్గిట్స్:-8,ఆస్ట్రేలియా డాలర్స్:-175 వచినవి అని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ప్రకటన చేశారు,ఈ హుండీ లెక్కింపులో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి జయ ప్రకాష్ బాబు, కార్యనిర్వాహణ అధికారి బి.వి సుబ్బారావు,డిప్యూటీ కమిషనర్ మరియు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి మహేశ్వర్ రెడ్డి,దేవస్థాన సిబ్బంది మరియు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# చిల్లకల్లు గ్రామ ప్రజలకు చీకటిని పారద్రోలి... విద్యుత్తు కాంతులతో వెలుగులు నింపిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)





**జగయ్యపేట్ట నియోజక వర్గం మార్చి 31** జగయ్యపేట్ట మండలం చిల్లకల్లు గ్రామంలో గత 30 సంవత్సరాలుగా కొనసాగుతున్న విద్యుత్ సమస్యకు ముగింపు పలికేలా జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కృషి చేశారు. విద్యుత్ సమస్యల తో ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజల సమస్యను గుర్తించి, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు.ఎమ్మెల్యే పట్టుదల ఫలితంగా స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు గ్రామంలో మూడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు, మరో రెండు ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్‌ను పెంచారు. దీంతో గ్రామ ప్రజలకు దీర్ఘకాలంగా ఉన్న విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.సోమవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులు మరియు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధించడం చాలా సులభమని, అది నల్లేరు మీద నడక లాంటిదని పేర్కొన్నారు.అధికారులు కూడా శాసనసభ్యులు సూచించిన పనులను మంజూరు చేయించే వరకు నిరంతరం కృషి చేశారని ఆయన ప్రశంసించారు. విద్యుత్ శాఖ ఏఈ, ఏడీఈ అధికారులు ఎమ్మెల్యే కృషిని అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు అధికారులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి అంగరంగ వైభోగమే కళ్యాణ మహోత్సవాలు











**ఎన్టీఆర్ డిస్టిక్ మార్చి 31** జగయ్యపేట్ట మండలం తిరుమలగిరి గ్రామంలోని వేచి ఉన్న శ్రీ శ్రీ శ్రీ స్వయంభు వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నిర్వహించు కార్యక్రమా లు దేవస్థానం సహాయ కార్యదర్శి కార్య నిర్వహణ అధికారి.ఎస్. వెంకట సాంబశివరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు కార్యక్రమం వివరాలు ది.1-04-2026.నుండీ.6-04-2026. వరకు. జరుగు స్వామి వారి వియాన బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ది.01-04-0226.అంకురూపణ ఉదయం సుప్రభాత సేవలో . స్వామివారి పెళ్లి కుమారుని గా చేయటం అనంతరం స్వామివారి ఇడుములు కార్యక్రమం ది.02-04-2026. శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం మహోత్సవం సమయము. రాత్రి 9 గంటలకు. అత్యంత అంగరంగ వైభోగంగా స్వామి వారి కళ్యాణ కార్యక్రమం ది.03-04-2026. స్వామివారిని ఊరేగింపు రథోత్సవ కార్యక్రమం.ది.04-04-2026. నాడు. సదస్యము. కార్యక్రమం ది.05-04-2026. నాడు. స్వామివారికి పూర్ణాహుతి కార్యక్రమం ది06-04-2026. నాడు. స్వామివారికి పవళింపు సేవా కార్యక్రమం.ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం బ్రహ్మోత్సవ కార్యక్రమాలు తిరుమలగిరి దేవస్థానం వారు నిరోధించి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు ఈ సందర్భంగా ఆలయ ఈవో మాట్లాడితే స్వామివారి కళ్యాణం బ్రహ్మోత్సవ కార్యక్రమాలకు వివిధ శాఖ అధికారులు ఇటువంటి అల్లర్లకు ఎటువంటి ఇబ్బందులు కలపకుండా స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా విద్యుత్ కాంతుల మధ్య యావది మంది భక్తులు మధ్య. స్వామివారి కల్యాణ మహోత్సవం చూపించబడును అని ఆలయ సహాయ కమిషనర్ కార్యనిర్వహణ అధికారి కె. వెంకట సాంబశివరావు తెలియపరిచినారు

# డిజిటల్ ప్రపంచం ప్రతి క్షణం ఫూల్స్ అవుతూనే ఉన్నాం !

### (01 ఏప్రిల్ "ఏప్రిల్ ఫూల్స్ డే" సందర్భంగా)

"తాజా సమాచారం ప్రకారం, అమెరికా అధ్యక్షుడు తాను ఇటీవల తీసుకున్న నిర్ణయాలన్నింటినీ వెనక్కి తీసుకున్నారనే వార్త ప్రపంచ మానవాళిని ఆనంద డోళికల్లో ముంచేస్తున్నది. అదే విధంగా ప్రపంచ ప్రజలు స్మార్ట్‌ఫోన్‌పై విరక్తి చెంది నేటి నుంచి వాడడం మానేశారనే వార్త కూడా సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నది". ఈ వార్తలను మీరు నమ్మడం లేదు కదా ! మీరు నమ్మినట్లైతే మీరు పప్పులో కాలేయినట్లే, ఏప్రిల్ ఫూల్ అయినట్లే.

చిలిపి సరదాల నెలవు ఆల్ ఫూల్స్ డే :
అనాదిగా ప్రపంచ దేశాలు 01 ఏప్రిల్ రోజున "ఏప్రిల్ ఫూల్స్ డే" లేదా "ఆల్ ఫూల్స్ డే" నిర్వహించుకోవడం చూస్తేనే ఉన్నాం. ఆత్మీయులను సరదాగా ఆట పట్టించడం, క్షణ కాలం పాటు అబద్ధాలతో సహచరులు లేదా బంధువులను ఆశ్చర్యచకితులను లేదా ఫూల్ చేయడం, లేని దానిని ఉన్నట్లు లేదా ఉన్న దానిని లేనట్లుగా భ్రమింపజేయడం, జోక్స్ వేసుకొని నవ్వుకోవడం, చిలిపిగా ఒకరినొకరు మోసం చేసుకోవడం, అబద్ధపై వార్తలను సామాజిక మాద్యమాల్లో పోస్ట్ చేయడం లాంటి పలు ప్రవర్తనలతో ఏప్రిల్ ఫూల్ అంటూ సంతోషంగా గడపడం "ఆల్ ఫూల్స్ డే"కు మాత్రమే సొంతం.

ఏప్రిల్ ఫూల్ దినం చారిత్రక నేపథ్యం:
చారిత్రక నేపథ్యాలను తవ్వి చూస్తే ఏప్రిల్ ఫూల్స్ డే జననం 1582కు చెందుతుంది. ఫ్రాన్స్‌లో 01 ఏప్రిల్ రోజున ప్రారంభం అయ్యే జూలియన్ క్యాలెండర్ నుంచి 01 జనవరిన ప్రారంభమయ్యే గ్రిగోరియన్ క్యాలండర్‌కు మారిన సందర్భంలో ప్రజల కొంత అసౌకర్యానికి లోనుకావడం, ఈ మార్పును అర్థం చేసుకోలేదని వారిని ఏప్రిల్ ఫూల్‌గా గేలి చేయడం ఆచారంగా మారి, కాల క్రమంలో అన్ని దేశాలకు విస్తరించడంతో ఏప్రిల్ ఫూల్ డే బహుళ ప్రచారంలోకి వచ్చింది. మరో వివరణ ప్రకారం హిలారీ అనే పురాతన రోమ్ పండుగలో రుతువులు మారుతూ వాతావరణ మార్పులు అసంబద్ధంగా ఉండడంతో ఏప్రిల్ ఫూల్ అంటూ ఒకరినొకరు ఆట పట్టించుకోవడం జరిగేదని కూడా తెలుపబడింది. బైబిల్ ఆచారం ప్రకారం 'నోహ్' అనే పాత్ర తొలి ఏప్రిల్ ఫూల్ అయ్యాడని తెలుపుతున్నది. వ్యాపార సామ్రాజ్యాలు, క్రీడలు, రెస్టారెంట్లు లాంటి అనేక స్థలాల్లో కూడా 01 ఏప్రిల్ రోజున ఆల్ ఫూల్స్ డేను సరదాగా ప్రదర్శించడం జరుగుతూ వస్తున్నది.

హానికరం కాని,మరొకరి మనసు నొప్పించని జోక్స్, అవమానకరం కాని అవాస్తవ సమాచారాలు, ఆట పట్టించే సందర్భాలతో కొనసాగుతున్న ఆల్ ఫూల్స్ డే ప్రపంచ మానవాళిని సంతోష సాగరంలో ముంచేయడంతో పాటు మానసిక సాంత్వన చేకూర్చడం జరుగుతున్నది. నేటి ఏప్రిల్ ఫూల్ డే సరదాగా గడపాలని, మన వల్ల మరొకరి మనసు నొచ్చుకోకూడదని అర్థం చేసుకుంటూ ఆనందంగా ఆల్ ఫూల్స్ డేను జరుపుకుందాం. దైనందిన వేగవంతమైన జీవన విధానం లోంచి కొంత సమయాన్ని కేటాయించి ఏప్రిల్ ఫూల్ అంటూ మానసిక ఒత్తిడిని తగ్గించుకుంటూ ఈ రోజైనా ఉల్లాసంగా గడుపుదాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# సర్వేంద్రియానాం నయనం ప్రధానం

### (01 -07 ఏప్రిల్ "అంధత్వ నివారణ వారోత్సవాలు" సందర్భంగా)

పంచేంద్రియాల్లోకి నేత్రాలు ప్రధానమైనవి మనకు తెలుసు. చూపు మందగిస్తే బతుకు చీకటిమయం అవుతుంది. చూపు కలిగిన వారికి దృష్టి ప్రాధాన్యం పెద్దగా అర్థం కాదు. ప్రపంచవ్యాప్తంగా 2.2 బిలియన్ల ప్రజలు దృష్టి సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో 10 మిలియన్లకు పైగా భారతీయులు కూడా ఉండడం విచారకరం. రాజస్థాన్, ఎంపీ రాష్ట్రాల్లో అంధత్వ సమస్య ఎక్కువగా ఉన్నది. అంధత్వ నివారణకు తగు జాగ్రత్తలు పాటించడంతో పాటు నేత్ర సంబంధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 01 – 07 ఏప్రిల్ వరకు దేశవ్యాప్తంగా "అంధత్వ నివారణ వారోత్సవాలు (ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్‌నెస్ వీక్)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. అంధత్వ నివారణ, అంధ పాఠశాలల నిర్వహణ, హక్కుల పరిరక్షణ, నేత్రదాన ఉద్యమాలు, అంధులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పన లాంటి చర్యలు తీసుకోవడం నేటి ప్రభుత్వాల, పౌర సమాజ కనీస బాధ్యత అని తెలపడానికి ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

రైట్ టు సైట్ మన నినాదం కావాలి:
నేత్ర ఆరోగ్య ప్రాధాన్యతను గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 08 అక్టోబర్ రోజున "ప్రపంచ దృష్టి దినం", మార్చి 07 నుంచి 13 వరకు "ప్రపంచ గ్లకోమా వారం", అక్టోబర్ నెలను "అంధత్వ అవగాహన మాసం"గా పాటించడం జరుగుతున్నది. అంధత్వం మూడు రకాలుగా కనిపిస్తుంది. వీటిలో ట్రకోమా, కాటరాక్ట్, విటమిన్-ఏ లోపం కారణాలతో అంధత్వ సమస్య ఉత్పన్నం అవుతున్నది. డబ్ల్యూహెచ్‌ఓ చేపట్టిన "రైట్ టు సైట్ (దృష్టి హక్కు)" నినాదంతో అంధత్వ నివారణ చర్యలు కొనసాగుతున్నాయి. విటమిన్-ఏ లోపం కారణంగా వచ్చే అంధత్వం నివారించదగినదని ప్రభుత్వాలు, ప్రజలు గుర్తించాలి. నేత్ర ఆరోగ్య పరిరక్షణ, నేత్ర రుగ్మతల చికిత్స, దృష్టి దోషం ఉన్న మేధావుల విజయగాథలు, నేత్ర ఆరోగ్య పరిరక్షణ పరిశోధనలు, స్వచ్ఛంద సంస్థల సహకారం లాంటి అంశాల్లో శ్రద్ధ వహించడం వల్ల సత్ఫలితాలు కనిపిస్తాయని తెలుసుకోవాలి. గ్లకోమా, కంటి శుక్లాలు, కండ్ల కలకలకు వైద్యం సకాలంలో అందితే అంధత్వం రాకుండా కాపాడుకోవచ్చు.

అంధత్వ కారణాలు, నివారణ చర్యలు:
కంప్యూటర్, ల్యాబ్‌టాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ లాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను గంటల తరబడి వాడడంతో నేత్ర సమస్యలు ఉత్పన్నమవుతాయి. అంధత్వ సమస్యలు 80 శాతం వరకు నివారించదగినవే. వయస్సు 50 ఏండ్లు దాటిన వారికి నేత్ర సమస్యలు అధికంగా కనిపిస్తాయి. నేత్ర గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం, కంటి గాయాలకు సత్వరమే చికిత్స తీసుకోవడం, తరుచుగా నేత్ర పరీక్షలు చేయించుకోవడం, విటమిన్ ఏ కలిగిన పోషకాహారం తీసుకోవడం, కాటరాక్ట్ చికిత్సలు చేయించుకోవడం, నేత్రాలను కళ్ల అద్దాలతో పరిరక్షించుకోవడం, నేత్ర శుభ్రతను పాటించడం, ముందస్తు లాంటి చర్యలు, పొగాకు వంటి దురలవాట్లకు దూరంగా ఉండడం లాంటి చర్యలు అంధత్వాలను నివారిస్తాయి. విధిగా మరణానంతరం నేత్ర దానం చేయడం తప్పనిసరి అని తెలుసుకోవాలి. మనం మరణించిన తర్వాత కూడా నేత్ర దానం తో మరో జన్మకు అర్థాన్ని, దృష్టిని ఇవ్వవచ్చు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం. కంటి చూపు లేని జీవితం చీకటిమయం. చూపును పరిరక్షించుకోవడం మన చేతుల్లోనే ఉన్నది. తగు జాగ్రత్తలు పాటిస్తే జీవితం రంగుల హరివిల్లు అవుతుంది.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకర్లు సాధించాలి

### కౌలు రైతులకు నిర్దేశించిన మేర రుణాలు అందించాలి
### పిఎం సూర్యఘర్ ముఫ్తి బిజిలి యోజన పథకంలో 10 వేల యూనిట్లకు రుణాలు అందించాలి
### బ్యాంకర్ల సమావేశంలో వార్షిక రుణా ప్రణాళిక లక్ష్యాల సాధనపై అధికారులు, బ్యాంకర్లతో కలెక్టర్ కె. వెట్రిసెల్వి సమీక్ష










**ఏలూరు, మార్చి 31..**జిల్లాలో వార్షిక రుణ ప్రణాళికను ననుసరించి ప్రాధాన్యత రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి బ్యాంకర్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం బ్యాంకర్ల సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో 2025- 26 వార్షిక రుణ ప్రణాళిక అమలులో నిర్దేశించిన లక్ష్యాల సాధనపై అధికారులు, బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రాధాన్యతా రంగాలలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు పంట రుణాలుగా 13 వేల 965 కోట్ల రూపాయలు రుణ లక్ష్యాలను సాధించారని, అదే సమయంలో ప్రాధాన్యతా రంగాలలో 48. 17 శాతం మాత్రమే లక్ష్యసాధనపై కలెక్టర్ స్పందిస్తూ ప్రాధాన్యతా రంగాలలో నూరుశాతం లక్ష్యసాధన జరిగేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవా లన్నారు. కౌలు రైతులకు 2025 2025 ఖరీఫ్, రబీ కాలానికి 375 కోట్ల రూపాయలు రుణాలు అందించాల్సి ఉండగా 124 కోట్ల రూపాయలు మాత్రమే అందించారన్నారు. ఎంఎస్ఎంఈ లక్ష్యాలలో 65. 84 శాతం మాత్రమే లక్ష్య సాధన చేశారన్నారు. కౌలు రైతులకు, ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు కూడా నిర్దేశించిన లక్ష్యాల మేర రుణాలు అందించాలన్నారు. ప్రభుత్వ పథకాలకు నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకర్లు సాధించేలా బ్యాంకర్ల తో సమన్వయము చేసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో 13 వేల 659 స్వయం సహాయక సంఘాలకు 1364. 34 కోట్ల రూపాయలు రుణాలుగా అందించారన్నారు. పట్టణ ప్రాంతాలలోని 2050 స్వయం సహాయక సంఘాలకు 242. 34 కోట్ల రూపాయలు రుణాలుగా అందించారన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తి బిజిలి యోజన పథకంలో 5620 దరఖాస్తులు మాత్రమే మంజూరు చేయడంపై కలెక్టర్ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 10 వేల యూనిట్లు ఏర్పాటుచేయాలని లక్ష్యాలను నిర్దేశించిందని, లక్ష్యాలు సాధించే దిశగా బ్యాంకర్ల వద్ద పెండింగ్ ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. జిలాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు 219 దరఖాస్తులు అందగా, 31 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, 22 దరఖాస్తులు తిరస్కరించడం జరిగిందన్నారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి కారణాలు తెలుసుకుని, పరిష్కరించదగిన అంశాలు ఉంటె పరిశీలించాలని బ్యాంకర్లకు కలెక్టర్ సూచించారు. చిన్న వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి ఉద్దేశించిన పిఎం స్వనిది పథకంలో 1325 దరఖాస్తులు బ్యాంకర్ల వద్ద పెండింగ్ ఉండడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వాటిని వెంటనే పరిశీలించి నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులకు రుణాలు అందించాలన్నారు. పిఎంఈజిపి పెండింగ్ లో ఉన్న 44 దరఖాస్తులు, పిఎం విశ్వకర్మ పథకంలో పెండింగ్ లో ఉన్న 166 దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ఎంతో అనువైన పరిస్థితులు ఉన్నాయని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. పాడి పశువులకు రుణాలు అందించే సమయంలో పశువుల భీమా పథకాలపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ సత్యనారాయణ రెడ్డి,,ఆర్బీఐ ఇ ఎల్డి డి యు . ఎలమంద, నాబార్డ్ ఏజీఎం అనిల్ కాంత్, ఎల్డిఎం నీలాద్రి, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాష, ఉద్యానవనాలు శాఖాధికారి సాజా నాయక్, బిసి కార్పొరేషన్ ఈడి పుష్పలత, డిఆర్డిఏ ఏపిఎం భూషణం, మెప్మా పీడీ ఎం. రాజబాబు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏలూరు జిల్లా 2026-27 పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ బుక్లెట్ ను కలెక్టర్ విడుదల చేశారు.

# "పోలీస్ ఉద్యోగం అంటేనే నిత్యం విశ్రాంతి లేకుండా ఎన్నో సవాళ్లు, వత్తిళ్లు, శారీరక మానసిక శ్రమను ఎదుర్కోవటం - అలాంటి విధి నిర్వహణలో సుదీర్ఘ కాలం పాటు సేవలు అందించటం మరెంతో అభినందనీయం": ఎస్పీ(నాన్ క్యాడర్ ) గా ఉద్యోగఉన్నతి పొందిన ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా. సూర్యచంద్రరావు కి అభినందనలు తెలిపిన దెందులూరు ఎమ్మెల్యే శ్రీ. చింతమనేని ప్రభాకర్.





**దెందులూరు, మార్చి 31.**ఏలూరు జిల్లా బాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన ప్రమోషన్స్ లో భాగంగా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ( నాన్ క్యాడర్గా) ఉద్యోగఉన్నతి పొందిన ఏలూరు జిల్లా అదనపు ఎస్పి నక్కా సూర్యచంద్రరావు గారు దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చము అందించి శాలువాతో సత్కరించారు..ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పోలీస్ విధి నిర్వహణలో ఎంతో అంకితభావంతో పనిచేసి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ స్థాయి నుంచి ఈనాడు ఎస్పీ సాయి వరకు నక్క సూర్యచంద్రరావు ఎదగడం ఎంతో అభినందనీయమని, ఆయన సర్వీసు తొలినాళ్లలో తమ దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పెదవేగి స్టేషన్ లో కూడా సూర్యచంద్రరావు గారు పోలీస్ అధికారిగా విధులు నిర్వహించారని, గ్రామాల్లో ఏదైన వివాదాలు, సమస్యలు ఏర్పడినప్పుడు వాటిపై ఒక పోలీస్ అధికారిగా మాత్రమే కాకుండా మానవత్వంతో కూడా ఆలోచిస్తూ ఇరు పక్షాల వారికి అవగాహన కల్పించటం ద్వారా నక్క సూర్యచంద్రరావు విధులు నిర్వర్తించేవారని, అదేవిధంగా తన సుదీర్ఘ పోలీస్ సేవలు ప్రస్థానంలో ఎంతోమంది కిందిస్థాయి సిబ్బంది వద్ద ఈనాటికి ఎంతో అభిమానాన్ని సంపాదించుకున్నారని, పదోన్నతిలో భాగంగా విజయవాడ నగర ట్రాఫిక్ విభాగానికి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ గా వెళుతున్నందుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు...

# అకాల వర్షంతో మామిడి రైతు విలవిల




**మందమర్రి, మార్చి 31, :** మండలంలో కురిసిన అకాల వర్షంతో చేతి కందిన మామిడి పంట రాలిపోవడంతో మామిడి రైతులు కన్నీరు మున్నీరయ్యారు. చేతికందిన పంట కళ్ళముందే రాలిపోవడంతో ఎంతో కష్టపడి కాపాడుకున్న పంట అకాల వర్షం గాలివానాలతో నే లమట్టం కావడాన్ని రైతులు జీర్ణించలేకపోతున్నారు. మండలంలోని చిర్రకుంట గ్రామపంచాయతీ పరిధిలో హర్టికల్చర్ అధికారిని కళ్యాణి దెబ్బతిన్న మామ తోటలను పరిశీలించింది. జరిగిన పంట నష్టాన్ని అంచనావేసి సంబంధిత అధికారులకు తెలియజేసి రైతులకు నష్ట పరిహారం వచ్చేలా చూస్తామని అన్నారు. హర్టికల్చర్ అధికారి వెంట మండల బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు మద్ది రామచందర్, రామటెంకి తిరుపతి తదితరులు ఉన్నారు.

# నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు.

**కరెంటు పునరుద్ధరించిన విద్యుత్ అధికారులు.**





**మందమర్రి, మార్చి 31 :** మండలంలోని శంకర్పల్లి గ్రామపంచాయతీ పరిధి సంద్రంపల్లి గ్రామంలో సోమవారం పురుష అకాల వర్షంతో విద్యుత్ స్తంభాల నేలకొరిగాయి. సమాచారం తెలుసుకున్న శంకర్పల్లి గ్రామ సర్పంచ్ వెంకటేష్ విద్యుత్ అధికారులు సమాచారం అందించడం జరిగింది. వెంటనే సంబంధిన విద్యుత్ అధికారులు నేలకొరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్తును పునరుద్ధరించారు. వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్, లైన్మెన్ సతీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ కడుపుతో తేనే కలిపిన గోరువెచ్చని నీటిని తీసుకుంటే చాలు



విటమిన్లు, ఖనిజాలు ఒకశాతం కంటే తక్కువే. ఖాళీ కడుపుతో తేనె కలిపిన గోరు వెచ్చని నీటిని తీసుకున్నా వీటి ప్రయోజ నాలు శరీరానికి అందుతాయి. లేత రంగు తేనెల్లో బయోయాక్టివ్ ప్లాంట్ సమ్మేళనాలు, యాంటీఆక్సిడెంట్లు అధికం, ముదురు రంగు తేనెల్లో ఇంకా ఎక్కువ. తేనె ఆర్గానిక్ ఆమ్లాలు,ఫినోలిక్ సమ్మేళనాలు (ఫ్లేవనా యిడ్లు) వంటి అనేక ముఖ్యమైన యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. ఈ సమ్మేళనాల మిశ్రమం తేనెకు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ గుణాన్ని ఇస్తుంది. బక్వీట్ తేనె రక్త ఆక్సిజనేషన్ ఇండెక్స్‌ను పెంచుతుంది. ఇది గుండెపోటు, స్ట్రోక్, కొన్ని క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించి కళ్ళ ఆరోగ్యానికి తోడ్పడుతుంది.తేనెను టేబుల్ షుగర్‌కు బదులుగా వాడటం టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో హృదయ సంబంధ సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇది చెడు ఎల్డీఎల్, ట్రైగ్లిజరైడ్స్, మంటను తగ్గించి మంచి హెచ్డీఎల్ ను పెంచుతుంది. తేనె చక్కెర స్థాయిని పెంచినా, సాధారణ షుగర్ కంటే చాలా తక్కువ ప్రభావం చూపుతుంది. డయాబెటిస్ ఉన్నవారు తేనెను జాగ్రత్తగా, మితం గా వాడాలి.కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహారాలను పరిమితం చేయాలి. మార్కెట్‌లోని కొన్ని తేనె ఉత్పత్తులు సిరప్‌తో కలుపబడి స్వచ్ఛమైన తేనె పోషకాలను కోల్పోతాయి.ఎలివేటెడ్ ట్రైగ్లిజరైడ్స్ గుండె వ్యాధులు, టైప్ 2 డయాబెటిస్‌కు కారణం అయ్యే ఇన్సులిన్ రెసిస్టెన్స్‌కు ప్రమాదకరం. చక్కెర, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లతో ఇవి పెరుగుతాయి. చక్కెర ప్రత్యామ్నాయం గా తేనెను క్రమం తప్పకుండా తీసుకోవడం ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గిస్తుంది. తేనెలో చక్కెర కంటే 11- 19 శాతం తక్కువ ట్రైగ్లిజరైడ్ ఉంటుందని శాస్త్రీయంగా నిరూపితమైంది కూడా. రోజువారీ తేనె వాడకం శరీర ట్రైగ్లిజరైడ్లను తగ్గిస్తుంది.తేనె ఫినాల్స్, యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలతో నిండుగా ఉంటుంది. ఇవి గుండె వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. యాంటీఆక్సిడెంట్లు ధమనులను విడదీసి రక్త ప్రవాహాన్ని పెంచుతాయి. రక్తం గడ్డకట్టడాన్ని నివారిస్తాయి. గాయాలు,కాలిన గాయాలకు తేనెను పూతగా పూయడం ఈజిప్టు కాలం నుండే ఉంది. నేటికీ సాధారణం. విస్తృత కాలిన, శస్త్రచికిత్స అనంతర లోతైన, సోకిన గాయాల నయం రేటు 43.3 శాతం.పిల్లల్లో ఎగువ శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల వల్ల వచ్చే దగ్గు నిద్ర, జీవన నాణ్యతను ప్రభావితం చేస్తుంది.దగ్గు మందులు ఎప్పుడూ ప్రభావవంతం కావు, దుష్ప్రభా వాలుంటాయి. తేనె దగ్గుకు మంచి ప్రత్యామ్నాయంగా పని చేస్తుంది. తేనె సాధారణ దగ్గు మందుల కంటే మెరుగ్గా పనిచేసి వాటి లక్షణాలు దూరం చేస్తుంది మంచినిద్ర పట్టడానికి కారణమౌతుంది. బాటులిజం ప్రమాదం వల్ల ఒక సంవత్సరం లోపు పిల్లలకు తేనె మానివేయాలి.

# హరీష్ రెడ్డి జన్మదినం సందర్భంగా పండ్ల పంపిణీ అన్నదానం

**రామగుండం :** నియోజకవర్గం బి ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక శారద నగర్ లో బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖనిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ కో ఆప్షన్ మెంబర్ తస్లీమా భాను చేతుల మీదగా నిరుపేదలకు, చిన్నారులకు భోజనం, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కటింగ్ చేయడం జరిగినది. అదే విధంగా ప్రభుత్వాసుపత్రిలో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో పేద ప్రజలకు అండగా నిలుస్తున్న హరీష్ రెడ్డి రాబోయే రోజుల్లో మరిన్ని సేవా



కార్యక్రమాలు నిర్వహించాలని ఉన్నత స్థానం అదిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కమల్, చెరుకు



రఘు, శ్రీనివాస్, ప్రశాంత్, తమ్మిమ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ నేతపై అనుచిత వ్యాఖ్యలా

**బే షరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్**
**బిజెపి కేంద్రమంత్రులు తెలంగాణలో తిరుగనివ్వం**
**బిజెపి నేతల అహంకారానికి పరాకాష్ట**
**నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి వద్ద దిష్టిబొమ్మ దగ్ధం**
**ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు మోత రోహిత్ హెచ్చరిక**

**హైదరాబాద్ మార్చి 31** ద్యమ నేతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు చర్యగా అభివర్ణిస్తూ బే షరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బిజెపి కేంద్రమంత్రులు తెలంగాణలో తిరుగనివ్వ మనీ హెచ్చరిస్తూ బిజెపి నేతల అహంకారానికి పరాకాష్ట సంఘటన అని నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి వద్ద



దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు మోత రోహిత్ హెచ్చరించారు. రాష్ట్ర సాధకుడు బడుగుల గొంతుక ఉద్యమ కెరటం గద్దర్ను పార్లమెంటులో అవమానిస్తూ అమిత్ షా వాక్యాలు చేస్తుంటే కేంద్ర మంత్రులు నవ్వుతూ ఉన్నారని తెలంగాణ ఉద్యమకారులకు అవమానం జరుగుతుంటే తెలంగాణ బిడ్డలుగా స్పందించాల్సింది పోయి నవ్వుతూ ఉండడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. క్షమాపణ చెప్పని పక్షంలో తీవ్ర ఆందోళన కార్యక్రమాలతో బిజెపి నేతలకు నిరసన సెగ చూపిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అమరులను అగౌరవాన్ని చూస్తూ ఊరుకోదని బిజెపి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మోత రోహిత్ వెల్లడించారు. బిజెపి అవమానానికి గౌరవంగా బిజెపి కార్యాలయం వెళ్లే దారికి గద్దర్ పేరు సీఎం రేవంత్ రెడ్డి పెట్టాలని వినతి చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ పెద్ద ఎత్తున కాంగ్రెస్ నేతలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సారంగపల్లి రేషన్ షాప్ పై చర్యలు తీసుకోవాలి

**కొత్త రేషన్ డీలర్ ను నియమించాలి.**

**మందమర్రి,మార్చి 31, :** మండలంలోని సారంగపల్లి గ్రామపంచాయతీలో ఉన్న రేషన్ డీలర్ పై తగిన చర్యలు తీసుకొని, కొత్తవారికి ఆ రేషన్ షాప్ అప్పగించాలని తహసిల్దార్ సతీష్ కుమార్ కు సారంగపల్లి శంకర్పల్లి వాసులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శంకర్పల్లి పరిధిలోని శంకరపల్లి సంద్రాన్ పల్లి, సారంగపల్లి పరిధిలోని దుబ్బపల్లి తురకపల్లి సారంగ పల్లెలకు ఒక్కరే రేషన్ డీలర్. ఈ రేషన్ షాప్ మిట్టపల్లి వెంకటేష్ అను అతని పేరు పై ఉన్నది. కానీ అతని స్థానంలో మిట్టపల్లి శ్రీనివాస్ మన వ్యక్తి రేషన్ షాప్ ను నడిపిస్తున్నారు. ఇతను ఎన్నడూ కూడా రేషన్ షాప్ సమయ సరళి పాటించలేదు. నెలలో కేవలం రెండు మూడు రోజులు మాత్రమే రేషన్ సప్లై చేసి చేతులు దులుపుకుంటారు. నిరుపేదలు ఈ ప్రాంతంలో రేషన్ బియ్యం పై ఆధారపడిన కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. రేషన్ షాప్ డీలర్ చేసే పనుల వల్ల చాలాసార్లు రేషన్ బియ్యం సమయానికి తీసుకోకుండా నష్టపోయామని సంబంధిత గ్రామస్తులు అంటున్నారు. తక్షణమే




రేషన్ షాప్ పై తగు చర్యలు తీసుకొని, అతని స్థానంలో కొత్తవారికి రేషన్ షాపు బాధ్యత అప్పగించాలని వారు కోరారు.దీనిపై సానుకూలంగా స్పందించిన తహసిల్దార్ సతీష్ కుమార్, ఎంక్వయిరీ చేసి డీలర్ షాప్ పై చర్యలు తీసుకుని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నీలయ్య, లింగయ్య, షేబ్బీర్, ఎర్ర రాజు, యువజన నాయకులు రాయబారపు కిరణ్ తదితరులు ఉన్నారు.

# సింగరేణి భవన్ లో సమావేశం

**హైదరాబాద్** 31-03-2026 మంగళవారం రోజున సి అండ్ ఎండి డైరెక్టర్ డైరెక్టర్ డైరెక్టర్ జనరల్ మేనేజర్ సి డి ఎన్ తో సింగరేణి భవన్, హైదరాబాద్ లో సీఎం ఓ ఏ ఐ కమిటీ సభ్యులతో సమావేశం జరిగినది

ఇట్టి సమావేశములో సి ఎం ఓ ఏ ఐ వారు ఇది వరకు ఇచ్చిన నోటీసు మేరకు సమస్యల పై సి అండ్ ఎండి తమ నిర్ణయం తెలియజేశారు.

1)- పే అప్-గ్రేడేషన్ గురించి స్టడీ చేయడం కొరకు కమిటీని ఏర్పాటు చేసి త్వరలో సి ఎల్ కు పంపించ దానికి ఆదేశించారు...

2)- పి ఆర్ పి బకాయిలు చెల్లించుట గురించి ముఖ్యమంత్రి కార్యాలయంలోని కార్యదర్శి ని త్వరలో కలిసి చెల్లింపులు త్వరగా అయ్యేటట్లు చూస్తానని తెలియజేశారు.

3)- మిగిలిన ఇతర సమస్యలను పరిష్కరించ దానికి త్వరలో స్ట్రక్చర్స్ మీటింగ్ నిర్వహించి చర్చించి పరిష్కరిస్తామని




తెలియజేశారు. ఈ సమావేశములో సీఎం ఓ ఏ ఐ ఎస్ సి సి ఎల్ బి ఈ సి ప్రసిడెంట్ లక్ష్మిపతి గౌడ్ ప్రధాన కార్యదర్శి.పెద్ది నరసింహులు సంయుక్త ప్రధాన కార్యదర్శి, రాజగోపాల్ కోశాధికారి,నరేష్ ఆర్ జీవన్, ఏరియా కార్యదర్శి కోల మల్లేశం ఆర్ జి త్రీ ఏరియా ప్రసిడెంట్ కోల శ్రీనివాస్ , బిహెచ్పిఎల్ ఏరియా ప్రెసిడెంట్, నజీర్ యమ్ యెన్ జి ఏరియా కార్యదశి మదన్నాయక్ గ ఏరియా ప్రెసిడెంట్ శివ ఎస్ టి పి పి ఏరియా ప్రెసిడెంట్, పంతుల ఎస్ ఆర్ పి ఏరియా ప్రెసిడెంట్ కె.విరెడ్డి ఎంఎం ఏరియా ప్రెసిడెంట్ రమేష్ ఏరియా సంయుక్త కోశాధి కారి బిపిఎల్ మురళీ పాల్గొన్నారు.ఈ సందర్భం గా అందరూ డైరెక్టర్ లకు జిఎంసిడిఎన్‌కు హృదయపూర్వక ధన్యవాదములు కృతజ్ఞతలు తెలియజేసినారు...

# ఓటరు జాబితా సవరణపై అవగాహన సమావేశం

**మందమర్రి, మార్చి 31,**

మందమర్రి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (SIR)--2026 కార్యక్రమానికి సంబంధించి మండల తహసీల్దార్ సతీష్ కుమార్ సమావేశంలో వివరాలు తెలియ జేశారు.మండలంలోని ప్రతి ఓటరు తమ ఓటరు గుర్తింపును తప్పనిసరిగా సరిచూసుకుని, బూత్ లెవల్ ఆఫీసర్ (BLO)కు ఎన్యూమరేటర్ ఫారంలో పూర్తి వివరాలతో సమర్పించాలని ఆయన సూచించారు. ఓటరు గుర్తింపు కార్డులో ఏవైనా పొరపాట్లు ఉన్నట్లయితే వాటిని సరిచేసుకోవాలని తెలిపారు.బూత్ స్థాయిలో సహాయకులుగా పని చేయడానికి బూత్ లెవల్ ఏజెంట్లు (బి ల్ ఏ )ను నియమిస్తారని, వారి సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రతి ఓటరు పాల్గొని సహకరించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌తో, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.






# కావ్య మారన్‌కు పోటీగా అనన్యా బిర్లా

ఐపీఎల్ లో ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. ప్రముఖ ప్లేయర్లతో పాటుగా ఫ్రాంచైజీ ఓనర్లు అంతకంటే ఎక్కువ క్రేజ్ సంపాదిస్తున్నారు. ఇప్పటి వరకు ఐపీఎల్ లో కావ్య మారన్ కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. కావ్య మ్యాచ్ వేళ ఇచ్చే ఎక్స్ ప్రెషన్స్ ఫ్యాన్స్ ను ఆకట్టుకుంటాయి. ఇప్పుడు కావ్యకు పోటీగా ఆర్సీబీ సొంతం చేసుకున్న అనన్యా బిర్లా క్రికెట్ వ్యాపారంలో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా నిలుస్తున్నారు. దీంతో, ఇప్పుడు కావ్య వర్సెస్ అనన్య పోరు మొదలైంది. ఎవరి ఆస్తులు ఎంత.. ఎవరి వ్యాపారం ఏంటి..సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్ కు ఐపీఎల్ లో మంచి క్రేజ్ ఉంది. కొన్నేళ్లుగా ఐపీఎల్ లో మోస్ట్ పాపులర్ లేడీ ఓనర్‌గా ఆమె కొనసాగుతున్నారు. వేలంలో ..గ్రౌండ్‌లో టీమ్ గెలిచిన సమయంలో ఇచ్చే చిరునవ్వుకు ఫిదా కావాల్సిందే. కాగా, తాజాగా ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా కుమార్తె అనన్యా బిర్లా ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్‌లో చేరడం లీగ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.ఆదిత్య బిర్లా గ్రూప్ ఏకంగా రూ. 16,706 కోట్లతో ఈ జట్టును దక్కించుకోవడంతో అనన్య ఇప్పుడు ఆర్‌సీబీకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నారు.నెటిజన్లు ఆమెను 'నేషనల్ క్రష్' అని, ఆర్‌సీబీకి దొరికిన 'లక్కీ చార్మ్' అంటూ పోస్టింగ్స్ చేస్తున్నారు. ఆర్‌సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ ఓపెనింగ్ మ్యాచ్‌లో ఆట కంటే కూడా అనన్య, కావ్యల మీదనే కెమెరాలు ఎక్కువగా ఫోకస్ చేశాయి. సోషల్ మీడియా వేదికగా ఇద్దరి మద్దతు దారులు తమ అనుకూల పోస్టింగ్స్ తో చెలరేగారు. ఇక.. అనన్యా బిర్లా వ్యాపారవేత్త తో పాటుగా ఇంటర్నేషనల్ పాప్ సింగర్. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ లో చదువుకున్న ఆమె, 17 ఏళ్ల వయసులోనే 'స్వతంత్ర మైక్రోఫిన్' సంస్థను స్థాపించి సక్సెస్ అయ్యారు. సంగీత రంగంలోనూ పట్టు ఉంది. డబ్బు పరంగా చూస్తే అనన్యా బిర్లా, కావ్య మారన్ కంటే చాలా ముందున్నారు. బిర్లా కుటుంబానికి సుమారు 19.1 బిలియన్ డాలర్ల ఆస్తులు ఉంటే, మారన్ కుటుంబానికి 2.57 బిలియన్ డాలర్ల ఆస్తులు ఉన్నాయి.



# బిగ్‌బాస్ బ్యూటీతో మహమ్మద్ సిరాజ్ డేటింగ్..?

టీమిండియా స్టార్ పేసర్, హైదరాబాద్ డీఎస్పీ మహమ్మద్ సిరాజ్.. బిగ్ బాస్ ఫేమ్ మహిరా శర్మతో పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరూ ఒకే కాఫీ షాప్‌లో కలిసి కనిపించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ కాఫీ షాప్ నుంచి ఈ ఇద్దరూ విడివిడిగా బయటకు వచ్చినప్పటికీ, ఒకే సమయంలో అక్కడే ఉండటంతో సందేహాలు మొదలయ్యాయి. వీరిద్దరూ కలిసి క్వాలిటీ టైమ్ గడిపారని, ఈ ఇద్దరి మధ్య సంథింగ్ సంథింగ్ నడుస్తుందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.అయితే ఈ డేటింగ్ వార్తలపై మహమ్మద్ సిరాజ్, మహిరా శర్మ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అలాగని ఖండించను లేదు. సిరాజ్, మహిరా శర్మ డేటింగ్‌లో ఉన్నారని వార్తలు రావడం ఇదే తొలిసారి కాదు. 2024 చివర్లోనే ఈ ప్రచారం మొదలైంది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒకరినొకరు ఫాలో అవ్వడం, ఫొటోలకు లైక్ చేసుకోవడంతో ఈ పుకార్లు మొదలయ్యాయి. గతేడాది ఈ డేటింగ్ వార్తలను సిరాజ్ ఖండించాడు. అవన్నీ అవాస్తవం, నిరాధారమైనవని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పెట్టాడు. ఆ వెంటనే ఆ పోస్ట్‌ను తొలగించాడు. మహిరా కూడా ఈ పుకార్లను ఖండించింది. తాను ఎవరితోనూ డేటింగ్‌లో లేనని, తన కెరీర్‌పై మాత్రమే ఫోకస్ పెట్టానని స్పష్టం చేసింది. కానీ ప్రతీ సెలెబ్రిటీ కపుల్ ఇలానే చెబుతుందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో మహమ్మద్ సిరాజ్ గుజరాత్ టైటాన్స్‌కు ఆడుతుండటంతో ఈ డేటింగ్ పుకార్లు మరోసారి తెరపైకి వచ్చాయి. పంజాబ్ కింగ్స్‌తో మరికాసేపట్లో ప్రారంభమయ్యే తొలి మ్యాచ్‌తో గుజరాత్ టైటాన్స్ తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్న సిరాజ్.. ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేయాలనే పట్టుదలతో ఉన్నాడు. జమ్మూ కశ్మీర్‌లో 1997లో పుట్టిన మహిరా శర్మ.. మోడల్‌గా కెరీర్ ప్రారంభించింది. సీరియల్స్‌తో యాక్టింగ్‌వైపు వచ్చింది. నాగిన్ 3 అనే సీరియల్‌లో 'చుర్చురి' పాత్రతో గుర్తింపు పొందింది. కుండలి భాగ్య, బేపనా ప్యార్ సీరియల్స్‌తో కూడా ఆమె పాపులారిటీని సొంతం చేసుకుంది. సల్మాన్ ఖాన్ హోస్ట్ చేసిన బిగ్ బాస్ హిందీ సీజన్ 13లో కంటెస్టెంట్‌గా పాల్గొని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ షోలో పరాస్ చాబ్రాతో ఆమె స్నేహం అప్పట్లో పెద్ద హాట్ టాపిక్ అయ్యింది. పంజాబీ ఇండస్ట్రీలో ఆమె ఒక టాప్ మోడల్.ముఖ్యంగా లెహంగా సాంగ్ ఆమెకు భారీ క్రేజ్ తెచ్చిపెట్టింది. ఈ పాట యూట్యూబ్‌లో 100 కోట్లకు పైగా వ్యూస్ సాధించింది. 'కదే హా కదే నా', 'లెంబర్గిన్ని' వంటి పంజాబీ సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. మహిరా శర్మకు ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్నారు. ప్రస్తుతానికి ఆమె హిందీ వెబ్ సిరీస్‌లు , పంజాబీ సినిమా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

# షాహీన్ అఫ్రిదిపై భారీ జరిమానా

పాకిస్థాన్ సూపర్ లీగ్ ఫ్రాంచైజీ లాహోర్ ఖలందర్స్ తమ స్టార్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిదిపై భారీ జరిమానా విధించింది. భద్రతా నిబంధనలను ఉల్లంఘించి నలుగురు వ్యక్తులను జట్టు బస చేస్తున్న హోటల్ గదిలోకి బలవంతంగా తీసుకెళ్లినట్లు ఆరోపణలు రావడంతో ఏకంగా రూ.10 లక్షలు (పాక్ కరెన్సీలో) ఫైన్ వేసింది. జట్టులో క్రమశిక్షణను కాపాడటం, జవాబుదారీతనాన్ని నిర్ధారించే క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఫ్రాంచైజీ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. పంజాబ్ పోలీసులు పీఎస్ఎల్ సీఈఓ సల్మాన్ నసీర్ కు రాసిన లేఖలో అఫ్రిదితో పాటు ఆ జట్టు ఆటగాడు సికిందర్ రజాపై తీవ్ర ఆరోపణలు చేసినట్లు న్యూస్18 ఇంగ్లీష్ పేర్కొంది. నలుగురు సందర్శకులను హోటల్ లోకి అనుమతించాలని వీరు కోరగా భద్రతా సిబ్బంది నిరాకరించారు.అయినా సరే వారు ఆ నలుగురిని గదిలోకి తీసుకెళ్లారని, దాదాపు మూడు గంటల పాటు అక్కడే ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఏడాది జరిగిన పీఎస్ఎల్ సీజన్ లో




లాహోర్ జట్టు పేలవ ప్రదర్శనతో టోర్నీ నుంచి నిష్క్రమించిన విషయం అందరికీ తెలిసిందే. వివాదాలు కూడా ఈ జట్టును వెంటాడుతున్నాయి.ఈ ఘటనపై లాహోర్ ఖలందర్స్ యాజమాన్యం స్పందిస్తూ, క్రమశిక్షణతో జవాబుదారీతనం ప్రదర్శించే ఉద్దేశంతోనే షాహీన్ షా అఫ్రిదిపై పది లక్షల రూపాయల జరిమానాను స్వచ్ఛందంగా విధించినట్లు వెల్లడించింది. ఈ విషయమై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కు పూర్తి వివరాలతో కూడిన వివరణను అధికారికంగా పంపినట్లు తెలియజేసింది. ఆటగాళ్లు, అధికారులు, ప్రేక్షకుల భద్రతను నిర్ధారించడంలో భద్రతా సిబ్బంది చేస్తున్న కృషిని ఫ్రాంచైజీ మనస్ఫూర్తిగా ప్రశంసించింది. నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించాలనే ఆలోచన ఆటగాళ్లకు లేదని, కేవలం ఒక చిన్న అపార్థం వల్లే ఈ సమస్య తలెత్తిందని ఫ్రాంచైజీ యాజమాన్యం వివరించింది. అయితే భద్రతా ప్రోటోకాల్స్ పట్ల తమకు పూర్తి గౌరవం ఉందని వారు పునరుద్ఘాటించారు. మరోవైపు భద్రతా ఉల్లంఘన ఘటనకు తాను పూర్తి బాధ్యత వహిస్తున్నానని సికిందర్ రజా స్పష్టం చేశాడు.

# రాజకీయాల్లోకి టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్



పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. 2026 మార్చి 31న భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, రాష్ట్ర మాజీ బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందర్ సమక్షంలో ఆయన భారతీయ జనతా పార్టీలో చేరి కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ చేరిక బీజేపీకి అదనపు బలాన్నిచ్చింది. యువతను ఆకర్షించే వ్యూహాత్మక అడుగుగా పార్టీ భావిస్తోంది. లియాండర్ పేస్ ఈ ఎన్నికల్లో పోటీ చేయకపోయినా, ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తూ యువ ఓటర్లపై సానుకూల ప్రభావం చూపుతారని బీజేపీ నమ్ముతోంది.లియాండర్ పేస్ 1973 జూన్ 17న కోల్‌కతాలో క్రీడా నేపథ్యమున్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి వెంకట్రామన్ 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో హాకీ కాంస్యం సాధించగా, తల్లి జెన్నిఫర్ 1980 ఆసియా బాస్కెట్‌బాల్ జట్టుకు నాయకత్వం వహించారు. గత ఏడాది ఆయన తండ్రి కన్నుమూశారు.పేస్ 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో పురుషుల సింగిల్స్‌లో బ్రెజిల్‌కు చెందిన ఫెర్నాండో మెలిగెనిని ఓడించి కాంస్యం గెలిచారు. వ్యక్తిగత ఒలింపిక్ పతకం సాధించిన కేడీ జాదవ్ తర్వాత తొలి భారతీయుడు ఆయనే. ఆయనకు 1990 అర్జున, 1996 ఖేల్ రత్న, 2001 పద్మశ్రీ, 2014 పద్మభూషణ్ పురస్కారాలు లభించాయి. పురుషుల సింగిల్స్‌లో గ్రాండ్‌స్లామ్‌లు లేకున్నా డబుల్స్‌లో పేస్ చరిత్ర సృష్టించారు. పురుషుల డబుల్స్‌లో మొత్తం ఎనిమిది గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు (2012 ఆస్ట్రేలియన్ ఓపెన్ సహా పలుమార్లు ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్) కైవసం చేసుకున్నారు.

# వైభవ్ సూర్యవంశీని భారత జట్టులోకి తీసుకోవద్దు..

## ● అశ్విన్ సంచలన వ్యాఖ్యలు.!



చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 17 బంతుల్లోనే 52 పరుగులు చేసిన వైభవ్ ఆటతీరుకు అందరూ ఫిదా అయ్యారు. ఈ ప్రదర్శన తర్వాత అతడిని జాతీయ జట్టులోకి 'ఫాస్ట్ ట్రాక్' చేయాలని కొందరు నిపుణులు కోరుతున్నారు. అయితే, తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన అశ్విన్.. వైభవ్‌పై ఇప్పుడే అంచనాల భారం వేయవద్దని సూచించాడు."అతనికి ఇప్పుడే లక్ష్యాలు నిర్దేశించకండి. అతను ఇంకా పిల్లాడే. ఒకవేళ ఎంఎస్ ధోనీ 44 ఏళ్ల వరకు ఆడితే, వైభవ్ 40 ఏళ్ల వరకు ఆడినా అతనికి ఇంకా రెండున్నర దశాబ్దాల క్రికెట్ కెరీర్ మిగిలి ఉంది. అతడిని ప్రశాంతంగా వదిలేయండి, సమయం వచ్చినప్పుడు అతనే తన సత్తాతో భారత జట్టులోకి వస్తాడు. అతను టీమ్ ఇండియాకు ఆడటంలో సందేహం లేదు, కానీ అంత తొందర ఎందుకు?" అని అశ్విన్ ప్రశ్నించాడు. తన మాజీ జట్టుపై వైభవ్ చేసిన దాడిని అశ్విన్ కొనియాడాడు. వైభవ్ బ్యాట్ స్పీడ్ చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందని, అతని వద్ద ఉన్న ఆత్మవిశ్వాసం అసాధారణమని పేర్కొన్నాడు. 15 ఏళ్లు నిండిన కొద్ది రోజుల్లోనే, 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది తన వయస్సును స్కోరు బోర్డుపై చూపించాడని చమత్కరించాడు. "వైభవ్ దాటికి సీఎస్‌కే బౌలర్ల వద్ద సమాధానం లేదు. మైదానంలో వారు పూర్తిగా డీలా పడిపోయారు. రాజస్థాన్ రాయల్స్ ఈ ప్రదర్శన ద్వారా తాము కూడా ఈ టోర్నీలో అత్యంత శక్తివంతమైన జట్టు అని చాటిచెప్పారు" అని అశ్విన్ విశ్లేషించాడు.

# రిటైర్‌మెంట్‌పై ఊహాగానాలకు మహ్మద్ షమీ చెక్

సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీకి టీమిండియాలోకి దారులన్నీ దాదాపు క్లోజ్ అయిన విషయం తెలిసిందే. వయసు ప్రభావం, ఫిట్‌నెస్ సమస్యలను కారణంగా చూపుతూ.. సెలెక్షన్ కమిటీ షమీ పేరును పరిగణలోకి తీసుకోవట్లేదు. దీంతో దేశవాళీలో సత్తా చాటుతున్నా.. షమీకి మాత్రం పిలుపురావడం లేదు. గతంలో టెస్టులు, వన్డేలు, టీ20 ఇలా మూడు ఫార్మాట్లలోనూ అదరగొట్టిన షమీని మళ్లీ టీమ్‌లోకి తీసుకోవాలని.. అతని అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని మాజీలు కూడా సూచించారు. షమీ తన చివరి వన్డే.. 2025 మార్చి 9న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో ఆడాడు. చివరి టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ను 2025 ఫిబ్రవరి 2న ముంబైలో ఇంగ్లాండ్‌పై ఆడాడు. ఇక టెస్టు క్రికెట్ ఆడి మూడేళ్లకుపైనే అయింది. ఈ నేపథ్యంలోనే షమీ రిటైర్‌మెంట్ విషయంపై క్లారిటీ ఇచ్చేశాడు.'ది శుభంకర్ మిశ్రా షో' మహ్మద్ షమీ మాట్లాడుతూ.. తాను అలసిపోయినప్పుడు క్రికెట్ వీడ్కోలు పలుకుతానని.. ప్రస్తుతానికి రిటైర్‌మెంట్ గురించి ఆలోచించడం లేదని స్పష్టం చేశాడు. రిటైర్‌మెంట్ ఆలోచన మనల్ని మరింత వెనక్కి లాగుతుందని.. ఆ ఆలోచన వస్తే అప్పటికే అలసిపోయారని అర్థమన్నారు. ఏ రోజు ఉదయాన్ని తాను నిద్రలేచిన తరువాత విసుగు పుడుతుందో..




అదే రోజు ఆటకు గుడ్ బై చెబుతానని అన్నాడు. బద్ధకం వచ్చినా.. విసుగు పుట్టినా.. అలసిపోయినా రిటైర్‌మెంట్ ప్రకటిస్తానని వెల్లడించాడు. ప్రస్తుతం తనకు బద్ధకం లేదని.. ఆటను ఆస్వాదిస్తున్నానని చెప్పుకొచ్చాడు షమీ. ఒక బౌలర్‌గా తాను వందశాతం తన బాధ్యతలు నెరవేరుస్తానని.. తనపై ఉంచిన అంచనాలకు అనుగుణంగా రాణిస్తానని అన్నాడు. గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడిన షమీ.. ఈసారి లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. షమీపై ా=ఎ టీమ్ భారీ అంచనాలు పెట్టుకోగా.. ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఐపీఎల్ మినీ వేలానికి ముందు గుజరాత్ టైటాన్స్ టీమ్‌తో ట్రేడ్ డీల్ చేసుకుంది. లక్నో తరఫున దుమ్ములేపి.. టీమిండియా జెర్సీలో షమీని మళ్లీ చూడాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

# శర్వా 'బైకర్'కు సెన్సార్ పూర్తి...
## ఏప్రిల్ 3న గ్రాండ్ రిలీజ్



యంగ్ హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న హై-ఆక్టేన్ స్పోర్ట్స్ ఫ్యామిలీ డ్రామా 'బైకర్' విడుదలకు సిద్ధమైంది. తాజాగా ఈ చిత్రం సెన్సార్ బోర్డు నుంచి యూ/ఏ (ఖ/ూ) సర్టిఫికెట్ పొందింది. దీంతో సినిమా విడుదలకు అన్ని అడ్డంకులూ తొలగిపోయాయి. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మించిన ఈ సినిమాకు అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహించారు. తమిళనాడులో ఈ చిత్రాన్ని థింక్ స్టూడియోస్ విడుదల చేస్తోంది. "ఇక అతడిని ఆపడం ఎవరి తరమూ కాదు" అనే క్యాప్షన్‌తో రిలీజ్ పోస్టర్‌ను విడుదల చేసి, విడుదల తేదీని ఖరారు చేసింది.

ఈ సినిమాలో సీనియర్ నటుడు రాజశేఖర్ 'బుల్లెట్' సునీల్ అనే కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ వీడియోలో, భారత రేసర్లు ఓడిపోవడానికి పుట్టలేదని నిరూపించాలనే తపన ఉన్న మాజీ మోటోక్రాస్ రేసర్‌గా రాజశేఖర్ పాత్ర ఆకట్టుకుంది. ఆయన కెరీర్‌లో 18 ఇండియన్ ఛాంపియన్‌షిప్‌లు, 57 సౌత్ జోన్ టైటిల్స్ గెలిచినట్టు చూపించారు. 'బైకర్' చిత్రంలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. డేరింగ్ బైక్ రేసర్‌గా కనిపించడం కోసం శర్వానంద్ పూర్తిగా మేకోవర్ అయ్యారు. ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తుండగా, జె. యువరాజ్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. భారీ అంచనాల మధ్య ఈ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.

# అందుకే వారిని పట్టించుకోవడం మానేశా

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆమె 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌పై సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన చిత్రం 'రాకాస'. మానస శర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నిహారిక తనపై వస్తున్న విమర్శలకు ఘాటుగా సమాధానమిచ్చారు.

నిర్మాతగా కెరీర్ ప్రారంభించినప్పటి నుండి తనపై ఎన్నో విమర్శలు వస్తున్నాయని నిహారిక ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ఏం చేసినా తప్పు పట్టేవాళ్లు ఉంటూనే ఉంటారు. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో 11 మంది కొత్తవాళ్లను పరిచయం చేసినప్పుడు.. ఎందుకు ఇదంతా? తెలిసిన వాళ్లతో సినిమాలు చేయొచ్చు కదా అన్నారు. ఇప్పుడు 'రాకాస' వంటి హై-వోల్టేజ్ వీఎఫ్ఎక్స్ సినిమా చేస్తుంటే... మళ్లీ చిన్న కథలే చేయొచ్చు కదా అని సలహాలు ఇస్తున్నారు. నేనేం చేసినా మాటలు అనేవాళ్లు అంటూనే ఉంటారు, అందుకే వారిని పట్టించుకోవడం మానేశాను" అని ఆమె తెలిపారు. నిర్మాతగా ప్రతి సినిమా తనకు ఒక పాఠమని, నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని నిహారిక తెలిపారు. "నాకు కొణిదెల కుటుంబం ఎంత ముఖ్యమో, నా 'పింక్ ఎలిఫెంట్' టీమ్ కూడా అంతే ముఖ్యం. నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటాను" అని ధీమా వ్యక్తం చేశారు.



# అందరినీ అలరించే కథ

ఒజి, శ్రీ సీతా రాముల కల్యా ణం చూత ము రారండి, అన్న య్య, ప్రేమ కోసం, శివ రామరాజు లాంటి బ్లాక్ బస్టర్ సినిమాలతో అలరించిన హీరో వెంకట్ సినిమాల్లోకి కమ్ బ్యాక్ ఇస్తున్నారు. విఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ లో వెంకట్ హీరోగా రూపొందుతున్న మాస్ కమర్షియల్ ఎంటర్ టైనర్ 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ ప్రకటించారు. సమ్మర్ స్పెషల్ గా మే 8న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. "ఇది పూర్తిగా మాస్ కమర్షియల్ ఎంటర్ టైనర్. ప్రేక్షకులు కోరుకునే అన్ని ఎలిమెంట్స్ ఇందులో వుంటాయి. ఇది అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించే కథ. వెంకట్‌కి ఇది మంచి కమ్ బ్యాక్ మూవీ అవుతుంది"అని చిత్ర నిర్మాతలు తెలియజేశారు. ఈ చిత్రంలో హెబ్బాపటేల్, సలోని, నాటషా, అలీ, సుమన్,రవి వర్మ, సుభాశ్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.




# అనుష్క 'కథనార్' ట్రైలర్ వచ్చేసింది..
## హాలీవుడ్ స్థాయిలో ఫాంటసీ హారర్ థ్రిల్లర్!

స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కథనార్' ట్రైలర్ విడుదలైంది. మలయాళంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ ఫాంటసీ హారర్ థ్రిల్లర్ ట్రైలర్, ప్రేక్షకులలో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. హాలీవుడ్ స్థాయి విజువల్స్, ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో విశేష స్పందన దక్కించుకుంటోంది.

రోజిన్ థామస్ దర్శకత్వంలో శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో జయసూర్య, ప్రభుదేవా, వినీత్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 13వ శతాబ్దం నాటి కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాలో అనుష్క పాత్ర ఎంతో గంభీరంగా, మిస్టరీతో కూడుకుని ఉన్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. పీరియాడిక్ సెట్టింగ్స్, వీఎఫ్ఎక్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

'బాహుబలి' తర్వాత సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న అనుష్కకు ఈ సినిమా ఎంతో కీలకంగా మారింది. ఇటీవల ఆమె నటించిన 'ఘాటీ' ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో 'కథనార్' చిత్రంలో అనుష్క పోషిస్తున్న శక్తిమంతమైన పాత్ర ఆమె కెరీర్‌కు మళ్లీ ఊపునిస్తుందని అభిమానులు గట్టి నమ్మకంతో ఉన్నారు. ఈ సినిమాతో స్వీటీ బలంగా కంబ్యాక్ ఇస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.






# సల్మాన్ సరసన నయన్..
## వంశీ పైడిపల్లి సినిమాలో అధికారిక ప్రకటన

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రంపై ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఖరారు చేసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్‌వీసీ) బ్యానర్‌పై అగ్ర నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది వారి 63వ చిత్రం ఈ ప్రాజెక్ట్‌లోకి నయనతారకు స్వాగతం పలకడం గౌరవంగా భావిస్తున్నామని, 'ది క్వీన్' అడుగుపెట్టిందని నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఇప్పటికే నయనతార బాలీవుడ్‌లో షారుఖ్ ఖాన్ సరసన 'జవాన్' చిత్రంలో నటించి భారీ బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఆ సినిమాతో ఉత్తరాది ప్రేక్షకులను సైతం మెప్పించిన ఆమె, ఇప్పుడు మరో అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్‌తో జతకట్టడం సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. తెలుగు దర్శకుడు, టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ కలిసి చేస్తున్న ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# పొరపాటున అలా మాట్లాడాను..
## 'పెద్ది' టీమ్‌కు ఎస్‌కేఎన్ క్షమాపణ





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా బృందానికి ప్రముఖ నిర్మాత ఎస్‌కేఎన్ బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. 'పెద్ది' విడుదల వాయిదా పడిందంటూ తాను చేసిన వ్యాఖ్యలు పొరపాటని, వాటిని వెనక్కి తీసుకుంటున్నట్లు ఓ వీడియో ద్వారా స్పష్టం చేశారు.

అసలేం జరిగిందంటే.. ఎస్‌కేఎన్ తన సొంత నిర్మాణ సంస్థలో వస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా విడుదల తేదీని ప్రకటించే క్రమంలో నిన్న రాత్రి 'పెద్ది' గురించి మాట్లాడారు. ఏ పెద్ద సినిమా విడుదలయ్యే తేదీలో తమ చిత్రాన్ని తీసుకురావొద్దనే ఉద్దేశంతోనే తాను అలా వ్యాఖ్యానించానని, కానీ అది పొరపాటుగా దొర్లిందని వివరించారు.

ఈ సందర్భంగా 'పెద్ది' సినిమా గురించి ఆయన సానుకూలంగా మాట్లాడారు. ఆ చిత్రం అనుకున్న సమయానికే విడుదలై ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. నిర్మాత ఎస్‌కేఎన్ తాజా వివరణతో ఈ అంశంపై నెలకొన్న గందరగోళానికి తెరపడినట్లయింది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com